Follow: @ANNTELUGU
ANN తెలుగు
08-10-2026
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 257 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్

ఏపీలో లోకల్‌వార్

- వైసీపీ పిటిషన్ పై సుప్రీంలో సర్కార్ కేవియట్



02

## మోదీ.. విష్ణువు చివరి అవతారం

- భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు
- 2019లోనే మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే



02

## ఆర్ బీఐ బిగ్ షాక్

- 2023 తరువాత వడ్డీ రేట్లు పెంపు
- మరింత భారం కానున్న ఈఎంఐ



03



## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ హవా

- వన్డేల్లో గిల్, టీ20ల్లో ఇషాన్ నంబర్ వన్!
- 'వన్డే, టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో టీమ్ఇండియా
- 'టెస్టుల్లో నాలుగో స్థానానికి పరిమితం.

02



## జననాయకుడి జంగ్ సైరన్

నేలపైనే పడుకుని ప్రియాంకగాంధీ నిరసన

ఎంపీలను ఇలాగే కొడతారా? అంటూ తీవ్ర ఆగ్రహం

- నేలపైనే పడుకుని ప్రియాంకగాంధీ నిరసన
- ఎంపీలను ఇలాగే కొడతారా? అంటూ తీవ్ర ఆగ్రహం
- రాహుల్ ఆధ్వర్యంలో జ్ఞానేశ్ రాజీనామాకు పట్టు
- విపక్ష ఎంపీల భారీ ఆందోళన.. తీవ్ర ఉద్రిక్తత
- రాహుల్ గాంధీని అరెస్ట్ చేసి బారాకంబ పోలీస్ స్టేషన్ తరలింపు
- రాహుల్ కు మద్దతుగా స్టేషన్ కు ఎంపీలు రేవంత్ రెడ్డి, వీడీ సతీషన్

02





## సైమన్ గో బ్యాక్ తరహాలో జీకే గో బ్యాక్

- సర్ ప్రక్రియ రద్దుచేసే వరకు పోరాటం ఆగదు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**న్యూఢిల్లీ:** దేశ ప్రజల ఓటు హక్కును హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు వర్గాలను సృష్టించే ప్రయత్నం జరుగుతోందని వాపోయారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తే.. ఆయనపై చర్యలు తీసుకోవడం దారుణమని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సి మిగతా 2వ పేజీలో



## దసరాకు పల్లెబాట

- 7 వేల ప్రత్యేక బస్సులను సిద్ధం చేసిన టీజీఎస్ఆర్టీసీ
- జోన్లు, రీజియన్ల వారీగా భారీ ఏర్పాట్లు.
- రద్దీ ప్రాంతాల్లో తాత్కాలిక బస్టాండ్లు

**హైదరాబాద్, మహా :** తెలుగు లోగిళ్లలో అత్యంత వైభవంగా జరుపుకునే దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లే లక్షలాది మంది ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు వివిధ జోన్లు, రీజియన్ల వారీగా సర్వీసులను కేటాయిస్తూ పూర్తి స్థాయి కార్యాచరణను ఖరారు చేసింది. ఈ ప్రత్యేక సర్వీసుల్లో మిగతా 2వ పేజీలో

## మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ

'రూ.1,108 కోట్లతో మహా ప్రాజెక్టు

- మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయానికి మహర్దశ.
- సాంకేతిక మార్గదర్శకత్వం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు.

**హైదరాబాద్,మహా:** రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ప్రవహిస్తున్న మూసీ నదిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన 'మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్' ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. మూసీ తీరంలో ఆధ్యాత్మిక, పర్యాటక శోభను ద్విగుణీకృతం చేసేలా గండిపేట మండలం మంచిరేవుల పరిధిలోని ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించింది. ఆలయ సమగ్ర అభివృద్ధితో పాటు అద్భుతమైన కనెక్టివిటీ కోసం ఆరు లేన్ల రహదారి నిర్మాణానికి కలిపి మొత్తం రూ.1,108.27 మిగతా 2వ పేజీలో



## ఎన్నికల సంఘంపై రణం

- జ్ఞానేశ్ దిగేదాకా.. పోరాటమే
- జంతర్ మంతర్‌లో జగడం

04

## ఐఈఈఈ వేదికపై హైదరాబాద్ యువ ప్రతిభ

- వేద గణితంలో చిన్ననాటే జాతీయ అవార్డు
- ఇప్పుడు హంగేరీలో అంతర్జాతీయ గుర్తింపు

02





## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

12 అజెండా అంశాలకు ఆమోదం.

**అమరావతి, మహా:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, వైద్యారోగ్య రంగాల బలోపేతం, విద్యాభివృద్ధి, పరిపాలనా సంస్కరణలే లక్ష్యంగా మొత్తం 12 అజెండా అంశాలకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేసింది. మంత్రివర్గంలో చర్చించిన అంశాలు, తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వాధినేతగా పాతికేళ్ల నిరంతర మిగతా 3వ పేజీలో






## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ హవా

- వన్డేల్లో గిల్, టీ20ల్లో ఇషాన్ నంబర్ వన్!
- 'వన్డే, టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో టీమ్‌ఇండియా.

*' టెస్టుల్లో నాలుగో స్థానానికి పరిమితం.

**దుబాయ్, మహా :** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ముఖ్యంగా పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శనతో భారత ఆటగాళ్లు అగ్రపీఠాలను కైవసం చేసుకున్నారు. వన్డే బ్యాటర్ల విభాగంలో యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ప్రపంచ నంబర్ 1 ర్యాంకును నిలబెట్టుకోగా, పొట్టి ఫార్మాట్ అయిన అంతర్జాతీయ టీ20ల్లో విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ అగ్రస్థానాన్ని అధిరోహించి అదరగొట్టాడు. అటు జట్ల విభాగంలోనూ టీమ్‌ఇండియా వన్డే, టీ20 ఫార్మాట్లలో ప్రపంచ నంబర్ 1 స్థానంలో నిలిచి తన జోరును కొనసాగించింది. వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ల హవా స్పష్టంగా కనిపించింది. శుభ్‌మన్ గిల్ టాప్ ర్యాంకులో కొనసాగుతుండగా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మూడో స్థానంలో, కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానంలో నిలిచి తమ సత్తా చాటారు. వీరితో పాటు మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ పదో స్థానాన్ని దక్కించుకున్నాడు. దీంతో వన్డేల్లో టాప్ 10 బ్యాటర్ల జాబితాలోనే ఏకంగా నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. మరోవైపు టీ20 ర్యాంకింగ్స్‌లోనూ యువ భారత్ ప్రభంజనం సృష్టించింది. ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో నిలవగా, దూకుడైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్న అభిషేక్ శర్మ రెండో ర్యాంకులో నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ ఏడో స్థానంలో, తిలక్ వర్మ పదో స్థానంలో నిలవడంతో టీ20 టాప్ 10 ర్యాంకుల్లోనూ నలుగురు భారత బ్యాటర్లు తమ స్థానాలను పదిలం చేసుకున్నారు. సుదీర్ఘ ఫార్మాట్ అయిన టెస్టు క్రికెట్ విషయానికి వస్తే.. వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఏడో స్థానంలో, శుభ్‌మన్ గిల్ తొమ్మిదో స్థానంలో నిలిచి టాప్ 10లో స్థానం సంపాదించారు. ఇక జట్ల ర్యాంకింగ్స్‌ను పరిశీలిస్తే.. వన్డే, టీ20 ఫార్మాట్లలో తిరుగులేని విజయాలతో టీమ్‌ఇండియా ప్రపంచ నంబర్ 1 ర్యాంకును సగర్వంగా కాపాడుకోగా, టెస్టు జట్ల ర్యాంకింగ్స్‌లో మాత్రం భారత్ ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



## మోదీ.. విష్ణువు చివరి అవతారం

**భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు**

**మహా :** భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా కొనసాగుతూ ప్రజా సేవ చేస్తున్న తీరును కొనియాడారు. మోదీ నాయకత్వంలో పొరుగు దేశాలతో సంబంధాలకు భారత్ ప్రాధాన్యం ఇస్తోందని టోబ్గే పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై బలంగా వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యుడిగా చేర్చడంలోనూ ఆయన కృషిని ప్రశంసించారు. మోదీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే.. ఆయనను చాలాకాలంగా అన్నయ్యగా భావిస్తున్నానని తెలిపారు. తర్వాత ఆయనను మార్గదర్శకుడిగా కూడా చూసినట్లు చెప్పారు. 2019లో మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2024లో ఢిల్లీలో మోదీని కలిసినప్పుడు తాను గతంలో చెప్పిన మాటల గురించి ఆలోచించానని, తాను తప్పుగా చెప్పలేదని తేల్చుకున్నానన్నారు. విష్ణువు చివరి అవతారమైన కల్కిగా మోదీ కనిపిస్తున్నారని టోబ్గే అన్నారు. అశాంతిని తొలగించి ధర్మాన్ని పునరుద్ధరించి కొత్త మార్పుకు నాంది పలికే అవతారమే కల్కి అని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని టోబ్గే వ్యాఖ్యానించారు. 2014లో ప్రధాని అయిన కొద్ది వారాల్లోనే మోదీ తన తొలి విదేశీ పర్యటనకు భూటాన్‌ను ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ పర్యటనలో భారత్‌భూటాన్ సంబంధాలను 'బీ4బీ'గా మోదీ అభివర్ణించారని తెలిపారు. అంటే 'భూటాన్ కోసం భారత్.. భారత్ కోసం భూటాన్' అని వివరించారు. భూటాన్ అభివృద్ధి ప్రణాళికలకు భారత్ అందిస్తున్న సహకారాన్ని టోబ్గే ప్రశంసించారు. 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ అందించే సాయాన్ని మోదీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పెంచిందని చెప్పారు.

# సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్

- సర్ ప్రక్రియ రద్దుచేసే వరకు పోరాటం ఆగదు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



( మొదటి పేజీ తరువాయి )

న ప్రభుత్వం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను అరెస్టు చేసిందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అన్నారు.

**'సైమన్ గో బ్యాక్' తరహాలో 'జీకే గో బ్యాక్'**

గతంలో 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు దేశంలో 'సర్ గో బ్యాక్', 'జీకే గో బ్యాక్' ఉద్యమం కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. గతంలో రైతుల ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించినా... చివరకు ప్రజల ఒత్తిడికి తలొగ్గి చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు కూడా ఎంత మొండిగా వ్యవహరించినా జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పేర్కొన్నారు. అవసరమైతే ఈ వ్యవహారం మరింత ముందుకు వెళ్లి ప్రధాని రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా వస్తుందని అన్నారు.

**దేశ ప్రజల ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరు**

భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ఎవరూ లాక్కోలేరని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను ఉపయోగించుకున్నారని, ఇప్పుడు నేరుగా ఎన్నికల సంఘాన్నే రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఓట్లను తొలగించి తమకు అనుకూలంగా ఎన్నికల ఫలితాలను మార్చే ప్రయత్నాలను కాంగ్రెస్ అడ్డుకుంటుందని చెప్పారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై పోలీసులు వ్యవహరించిన తీరును చూస్తే మోడీ, అమిత్‌షాల అసహనం స్పష్టంగా కనిపిస్తోందని సీఎం అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు, పదవులను కాపాడుకునేందుకు ప్రతిపక్ష నేతలపై పోలీసులను ప్రయోగిస్తున్నారని విమర్శించారు.

**కాంగ్రెస్ ఉద్యమం కాదు ఇది... ప్రజల ఉద్యమం**

దేశంలోని ప్రజలు జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రజల హక్కులను కాలరాసిన వారికి చరిత్రలో ఎవరూ తప్పించుకోలేదని, చివరకు ప్రజల కోర్టులోనే తీర్పు ఎదుర్కోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల డిమాండ్‌ను అంగీకరించి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు వీధుల నుంచి పార్లమెంట్ వరకు పోరాటం కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమైన ఉద్యమం కాదని, ఇండియా కూటమి, ప్రజల ఉద్యమమని అన్నారు. ప్రజలు ఒక్కటై గొంతెత్తితే ప్రభుత్వం తప్పనిసరిగా వినాల్సిందేనని, లేకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగుతారని, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం తెలిపారు.




### ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్

# ఏపీలో లోకల్ వార్

- వైసీపీ పిటిషన్ పై సుప్రీంలో సర్కార్ కేవియట్

**మహా :** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. బీసీ రిజర్వేషన్ల కేసు సుప్రీం కోర్టులో పెండింగ్ లో ఉండగా.. ఇప్పుడు ఎస్ఐఆర్ పూర్తి కాకుండా ఎన్నికలు నిర్వహించవద్దని కోరుతూ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులోనే పిటిషన్ దాఖలు చేసింది. దీంతో ఎన్నికల షెడ్యూల్ విడుదలపై టెన్షన్ పెరుగుతోంది. వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్ పై తమను పరిగణనలోకి తీసుకోకుండా తీర్పు ఇవ్వొద్దంటూ ప్రభుత్వం బుధవారం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ లో వైఎస్సార్సీపీ.. ఎస్ఐఆర్ పూర్తి కాకుండానే ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధమైందని, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో జనవరిలో ఉన్న డేటానే పరిగణనలోకి తీసుకుందని ఆరోపించింది. దీనిపై హైకోర్టులో సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైఎస్సార్సీపీ ఊరట కోసం ఎదురుచూస్తోంది. అలాంటి సమయంలో ప్రభుత్వం కేవియట్ దాఖలు చేయడం ద్వారా ఈ పిటిషన్ లో ప్రతివాదిగా చేరింది. దీంతో సుప్రీంకోర్టు ఈ కేసులో చేపట్టే విచారణ కీలకంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఏ క్షణంలో అయినా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడానికి అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ లాయర్ సుప్రీంకోర్టుకు తెలిపారు.



# మూసీ తీరంలో ఆధ్యాత్మిక శోభ

( మొదటి పేజీ తరువాయి )

కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ బుధవారం G.O.Rt.No.928 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. భవిష్యత్తులో అత్యంత ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మారనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ సముదాయ అభివృద్ధి పనులకు ఏకంగా రూ.948.65 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ ప్రాంగణంలో భారీ రాజగోపురాలు, విశాలమైన యాగశాల, సుందరమైన పుష్కరిణితో పాటు భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ఈ నిధులతో నిర్మించనున్నారు. ఈ పవిత్ర క్షేత్రానికి భక్తులు సులభంగా చేరుకునేందుకు వీలుగా మరో రూ.159.62 కోట్లతో 30 మీటర్ల (100 అడుగుల) వెడల్పుతో ఆరు లేన్ల రహదారిని నిర్మించనున్నారు. ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్‌విండ్ విల్లాస్ వరకు సుమారు 2.50 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం సాగనుంది. ఈ కొత్త రహదారిని గ్రేహౌండ్స్ దళాల కేంద్రం, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రాంతాలకు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల మూసీ రివర్‌ఫ్రంట్ రోడ్ నెట్‌వర్క్‌తో ఓంకారేశ్వర ఆలయానికి అత్యుత్తమ కనెక్టివిటీ ఏర్పడనుంది. మరోవైపు, ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన ఆలయ ప్రాజెక్టును అత్యంత పకడ్బందీగా, సాంప్రదాయ బద్ధంగా నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ.700 కోట్ల వ్యయంతో చేపట్టే ప్రధాన ఆలయ పనులకు పూర్తి సాంకేతిక మార్గదర్శకత్వం అందించేందుకు ఒక ప్రత్యేక 'టెక్నికల్ కమిటీ'ని ఏర్పాటు చేస్తూ G.O.Rt. No.929 ఉత్తర్వులు జారీ చేసింది. భవన నిర్మాణ నమూనాలు (డిజైన్లు), సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు), ధరల ఖరారు, టెండర్ల ప్రక్రియ వంటి అత్యంత కీలకమైన బాధ్యతలను ఈ కమిటీకి అప్పగించింది. ఈ టెక్నికల్ కమిటీలో వివిధ విభాగాలకు చెందిన అత్యున్నత అధికారులను, నిపుణులను భాగస్వాములను చేశారు. రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) ఇంజనీర్ ఇన్ చీఫ్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. పబ్లిక్ హెల్త్ విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్ కోఛైర్మన్‌గా, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. దేవాదాయ శాఖ చీఫ్ ఇంజనీర్, ప్రముఖ ఆలయ ఆర్కిటెక్చర్ నిపుణుడు డాక్టర్ ఈ. శివనాగిరెడ్డి, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి ఈ ఉన్నత స్థాయి కమిటీలో సభ్యులుగా సేవలందించనున్నారు.



## ఐఈఈఈ వేదికపై హైదరాబాద్ యువ ప్రతిభ

- వేద గణితంలో చిన్ననాటే జాతీయ అవార్డు
- ఇప్పుడు హంగేరీలో అంతర్జాతీయ గుర్తింపు

**హైదరాబాద్, మహా :** పాఠశాల స్థాయిలోనే వేద గణితంలో ప్రతిభ చాటుతూ జాతీయ స్థాయిలో అవార్డు సాధించిన హైదరాబాద్ యువకుడు ప్రణీత్ ముక్కాల తాజాగా అంతర్జాతీయ వేదికపై తన సత్తా చాటారు. హంగేరీలోని బుడాపెస్ట్‌లో నిర్వహించిన 2026 ఐఈఈఈ టెక్నాలజీ సమ్మిట్ - ఎథికల్ ఏఐలో ప్రణీత్ రూపొందించిన 'వేదిక్ మైండ్' ప్రాజెక్ట్ ప్రపంచస్థాయి టాప్-5లో చోటు సంపాదించింది.

**30 దేశాలు.. 115 దరఖాస్తులు**

ఐఈఈఈ ఎంటర్ ప్యూనర్ షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ ఫౌండర్ షోకేస్ - ఐడేషన్ ట్రాక్ కు ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుంచి 115 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఎంపికైన ఐదు అత్యుత్తమ ప్రాజెక్టుల్లో వేదిక్ మైండ్ కు స్థానం లభించింది. దీంతో ప్రణీత్‌కు తన ఆలోచనను అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సమక్షంలో ప్రదర్శించే అవకాశం దక్కింది.

**స్కూల్ నుంచే వేద గణితంపై మక్కువ**

ప్రణీత్ పాఠశాల స్థాయి నుంచే వేద గణితాన్ని నేర్చుకున్నారు. అందులో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో అవార్డు సాధించారు. వేద గణితంపై ఉన్న ఆసక్తిని ఆధునిక సాంకేతికతతో మేళవించాలనే ఆలోచనతో 'వేదిక్ మైండ్' ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. ప్రస్తుతం ప్రణీత్ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నారు. చదువుతోపాటు 'వేదిక్ మైండ్'ను మరింత అభివృద్ధి చేస్తున్నారు.

**అందరికీ అందుబాటులోకి..**

వేద గణితాన్ని విద్యార్థులకు సులభంగా, ఆసక్తికరంగా నేర్పించడమే 'వేదిక్ మైండ్' లక్ష్యమని ప్రణీత్ తెలిపారు. ఆధునిక సాంకేతికత, గేమిఫికేషన్‌ను ఉపయోగించి గణితాన్ని మరింత ఆసక్తికరంగా మార్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. వేదిక్ మైండ్ వెబ్‌సైట్‌ను మరింత ఆధునీకరించి, అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

**యువతకు స్ఫూర్తి**

పాఠశాల స్థాయిలో వేద గణితంలో జాతీయ అవార్డు నుంచి.. ఇంజినీరింగ్ విద్యార్థిగా అంతర్జాతీయ ఐఈఈఈ వేదికపై ప్రాజెక్ట్ ప్రదర్శించే స్థాయికి ప్రణీత్ చేరుకోవడం విశేషం. ఆయన సాధించిన ఈ గుర్తింపు హైదరాబాద్ యువతలోని సాంకేతిక ప్రతిభకు, సృజనాత్మక ఆలోచనలకు నిదర్శనంగా నిలుస్తోంది.




# జననాయకుడి జంగ్ సైరన్

**ఢిల్లీ, మహా :** జననాయకుడి.. జంగ్ సైరన్ కు ఢిల్లీ దద్దరిల్లుతోంది. ఎన్నికల కమిషన్ అక్రమాలపై ప్రశ్నిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు మోగించిన యుద్ధభేరి కేంద్రానికి చెమటలు పట్టిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి చేపట్టిన నిరసన మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వైపు వెళ్తున్న ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ప్రియాంక సహా పలువురు మహిళా నేతలు, కార్యకర్తలో నేలపై పడుకొని నిరసన తెలిపారు. కాగా ఈసీ తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలో రాహుల్ ను అరెస్ట్ చేసిన పీఎస్ కు వెళ్ళగా సీఎంను అడ్డుకున్నారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి ఉన్నారు. మరోవైపు కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా రాహుల్ నిరసనకుమద్దతు తెలుపుతూ పీఎస్ వద్దకు వెళ్ళారు. పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.

**రెండో రోజూ తగ్గేదెలే**

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జంతర్ మంతర్‌కు ర్యాలీగా వెళ్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో పోలీసులు తమను ముందుకు వెళ్లకుండా అడ్డుకోవడంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా రోడ్డు మీదే నేలపై పడుకొని నిరసన వ్యక్తం చేశారు. తనను అక్కడి నుంచి లేపేందుకు ప్రయత్నించగా, మహిళా పోలీసులు తనపై దాడి చేశారని, తన శరీరమంతా గోళ్లతో గాయపరిచారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీని కలవాలని వెళ్తుంటే ఎంపీలను కొడతారా? అని ప్రశ్నించారు. 'నేను ఇక్కడి నుంచి కదిలేది లేదు. కేవలం ఎన్నికల సంఘాన్ని కలవాలనుకున్న ఎంపీలతో వారు ప్రవర్తించే తీరు ఇదేనా? ఈ విధంగా ఎంపీలను కొడతారా? మహిళా పోలీసులు నన్ను గోళ్లతో గాయపరిచి కిందికి తోసేశారు. వారి బలగాలను వెనక్కి పిలవమనండి' అని ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు జంతర్ మంతర్ సమీపంలోని ఆందోళన స్థలం నుంచి ప్రియాంక గాంధీని బలవంతంగా తరలించారు.

**రాహుల్ సహా పలువురు ఎంపీలు అరెస్ట్**

మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు రెండు గంటల పాటు అదుపులో ఉంచుకుని ఆ తర్వాత విడుదల చేశారు. జంతర్ మంతర్‌కు చేరుకునే క్రమంలో భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఎంపీలు ప్రయాణిస్తున్న బస్సులను కూడా నిరసన ప్రదేశానికి కొంత దూరంలోనే నిలిపివేశారు. ఈ క్రమంలోనే కొందరు కాంగ్రెస్ ఎంపీలు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు. ఈ రెండు రోజుల్లో రాహుల్ గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇది మూడోసారి.

**ఆ ఇద్దరి జోక్యంతో వ్యవస్థలు నిర్వీర్యం..**

బారాఖంబా పీఎస్ నుంచి విడుదలైన అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రభుత్వ బెదిరింపులకు, పోలీసుల అణచివేతకు తాము భయపడేది లేదన్నారు. దేశంలోని అత్యంత పవిత్రమైన వ్యవస్థను కాపాడుకునేందుకు ఈ పోరాటం చేస్తున్నామని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఈ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షాల జోక్యంతో వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు: మల్లికార్జున ఖర్గే**

మంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. 'మాపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతలా బెదిరించాలని చూసినా మేం భయపడేది లేదు. నవ్వుతూనే ముందుకెళ్తాం. ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలనుకుంటున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని, వారు గూండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని మండిపడ్డారు. బుధవారం మధ్యాహ్నం ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశంపై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్ మంతర్‌వైపు ర్యాలీగా బయల్దేరారు.

# దసరాకు పల్లెబాట

( మొదటి పేజీ తరువాయి )



అత్యధికంగా కరీంనగర్ జోన్ పరిధి నుంచి మొత్తం 3,533 బస్సులను నడపనున్నారు. రీజియన్ల వారీగా పరిశీలిస్తే కరీంనగర్ నుంచి 1,175, నిజామాబాద్ 719, ఖమ్మం 678, వరంగల్ 530, ఆదిలాబాద్ నుంచి 431 బస్సులను సిద్ధం చేశారు. అలాగే హైదరాబాద్ జోన్ పరిధిలోని ఉమ్మడి జిల్లాల నుంచి మొత్తం 2,155 బస్సులను కేటాయించారు. ఇందులో నల్గొండ రీజియన్ నుంచి 815, మహబూబ్‌నగర్ 645, రంగారెడ్డి 440, మెదక్ నుంచి 255 బస్సులు రాకపోకలు సాగిస్తాయి. వీటికి తోడు రాజధాని నగరంలోని ప్రయాణికుల అవసరాల కోసం గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి ప్రత్యేకంగా 1,312 సర్వీసులను నడపాలని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. పండుగ ప్రయాణాల్లో ప్రధానంగా ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ఊళ్లకు వెళ్లేవారి రద్దీ తీవ్రంగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అలాగే పండుగ ముగిసిన అనంతరం ఈ నెల 25, 26 తేదీల్లో నగరానికి తిరిగివచ్చే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తిరుగు ప్రయాణ ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. హైదరాబాద్ నగరంలో ప్రధాన రవాణా కూడళ్ల వద్ద రద్దీని నివారించేందుకు మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్)లతో పాటు ఉప్పల్ నల్లచెరువు, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి నేరుగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతాల్లో ఎండ, వర్షాల నుంచి రక్షణగా ప్రత్యేక షామియానాలు, కుర్చీలు, నిరంతర తాగునీటి వసతి, ప్రయాణ సమాచారాన్ని చేరవేసే పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, మొబైల్ టాయిలెట్ల వంటి కనీస మౌలిక సదుపాయాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నడిపే ప్రత్యేక బస్సుల టికెట్ ధరల్లో నిబంధనల మేరకు సవరణ చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. అయితే, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు కల్పిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో యథావిధిగా వర్తిస్తుందని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులు తమ ప్రయాణ వివరాలు, రిజర్వేషన్లు, బస్సుల వేళలకు సంబంధించిన సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 0406944000, 040 23450033 లను సంప్రదించవచ్చని సూచించారు.



# వరంగల్‌లో అయ్యప్ప పూజా విధానం పై శిక్షణ తరగతులు

- **కేరళ సాంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు**
- **మహాశాస్త్ర తంత్ర పీఠం శ్రీ బ్రహ్మశ్రీ డాక్టర్ కుసుమ ప్రదీప్ కుమార్ తంత్రి**

**వరంగల్, మహా;** ఉమ్మడి వరంగల్ జిల్లా అయ్యప్ప భక్తుల తో పాటు గురు స్వాములకు ప్రజలకు మహాశాస్త్ర తంత్ర పీఠం వరంగల్ లోని స్టేషన్ రోడ్ లో ఘనంగా ప్రారంభించడం జరిగింది. మొట్టమొదటిగా తెలంగాణలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తూ మొదట హైదరాబాదులో రెండవ మన వరంగల్ లోని స్టేషన్ రోడ్ లో ఏర్పాటు చేశారు. మహాశాస్త్ర తంత్ర పీఠం బ్రహ్మ శ్రీ డాక్టర్ కుసుమ ప్రదీప్ కుమార్ తంత్రీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి సమాజానికి అయ్యప్ప స్వామి యొక్క పూజా విధానాన్ని కేరళ సాంప్రదాయ ప్రకారం గురు స్వాములకు అయ్యప్ప భక్తులకు కులమత భేదాలు లేకుండా లింగ బేధం లేకుండా జ్ఞానాన్ని ప్రసాదించాలని సంకల్పంతో మహా శాస్త్ర తంత్ర పీఠం ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మహా శాస్త్ర తంత్రపీఠం బ్రహ్మ శ్రీ డాక్టర్ కుసుమ ప్రదీప్ కుమార్ తంత్రి మాట్లాడుతూ.. మన వరంగల్ లోని స్టేషన్ రోడ్ లో తంత్ర పీఠం గత నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తు ప్రతి బుదవారం తరగతులు మన వరంగల్లో అంతేకాకుండా జనవరి నుండి ఈ యొక్క శిక్షణ తరగతుల ని మూడు విభజనలుగా అంటే మొదటగా ఆన్లైన్ తరగతులు రెండవది ప్రతి ఆదివారం మూడు గురుకులం లాగా శిక్షణ తరగతులు చెప్పడం జరుగుతుంది. అదేవిదంగా ఈ యొక్క సెంట్రల్ ఆఫీస్ హైద్రాబాద్ ఘట్కేసర్, రెండో బ్రాంచ్ మన వరంగల్లో ప్రారంభం ఘనంగా ప్రారంభించుకోవడం జరిగింది.. . ప్రతి సంవత్సరం మొదటి విడత అడ్మిషన్లు జనవరి నెలలో.. రెండో విడత అడ్మిషన్లు జూన్లో జరుగుతుంది ఈ యొక్క సదా అవకాశాన్ని వరంగల్ ట్రై సిటీ లోని అయ్యప్ప భక్తులు గురు స్వాములు ప్రతి ఒక్కరు కూడా కులమతాలక తీతంగా వినియోగించుకోవాలని మహాశాస్త్ర తంత్ర పీఠం శ్రీ బ్రహ్మశ్రీ డాక్టర్ కుసుమ ప్రదీప్ కుమార్ తంత్రి గురుస్వామి డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో గురు స్వాములు పోలా ఉమామహేశ్వర్, రాచర్ల రాజు, వెల్దండి ఓంకార్, వేముల రంజిత్, హనుమంతరావు, ఉంగరాల వెంకన్న, కోరే వెంకటస్వామి, వేయి కండ్ల జితేందర్ గురుస్వామి, చెవ్వ సంపత్ కుమార్, సుంకేనపల్లి శ్రీనివాస్, గంధసిరి రమేష్, ఆడేపు రఘు, తదితర గురు స్వాములు అయ్యప్ప స్వామి భక్త బృందం పాల్గొన్నారు.




# అనుమానితులపై నిఘా.. గ్రామాల్లో పోలీసుల జల్లెడ

- **లక్ష్మీపురం, మల్కాపూర్‌లో కార్డన్ అండ్ సెర్చ్**
- **వాహనాల తనిఖీ.. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన**
- **అపరిచితుల కదలికలపై సమాచారం ఇవ్వాలి: రూరల్ ఏసీపీ విజయకుమార్**

**కొత్తపల్లి, మహా**: శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. లక్ష్మీపూర్, మల్కాపూర్ గ్రామాల్లో బుధవారం సాయంత్రం విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. రూరల్ ఏసీపీ విజయకుమార్ పర్యవేక్షణలో, కొత్తపల్లి ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాల్లోని పలు వీధులను జల్లెడ పట్టారు. తనిఖీల్లో భాగంగా అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ఆరా తీయడంతో పాటు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టారు. గ్రామాల్లో అనుమానాస్పద కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయకుమార్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసమే ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలు, మోసపూరిత లింకులు, అనుమానాస్పద ఫోన్‌కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీలు, వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు మరింత దోహదపడుతుందని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఎస్సైలు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ బలగాలు పాల్గొన్నారు.

# రాజకీయ భవిష్యత్తు లేదనే దురుద్దేశంతో తప్పడు ప్రచారాలు.!

**ఆదిభట్ల అక్టోబర్ 7 మహా:** రాజకీయ భవిష్యత్తు కోల్పోతున్నామనే దురుద్దేశంతో ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్నారని, ఆదిభట్ల డివిజన్ అధ్యక్షులు పల్లె రజనీకాంత్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులపై మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై, సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలను చేస్తున్నటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, పల్లె రజనీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి,ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఆదిభట్ల సర్కిల్ ఆదిపట్ల డివిజన్ అధ్యక్షులు పల్లె రజనీకాంత్ గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి పథకం ఉచిత బస్సు ప్రయాణంతో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మహిళలకు చేకూరుతున్న లబ్ధి, వారికి ఆర్టీసీ అందిస్తున్న సౌకర్యాలపట్ల తెలుసుకునేందుకు, మంగళవారం రోజున బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్ నుంచి తుర్కయంజాల్ వరకు ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రయాణించారు. తోటి మహిళా ప్రయాణికులతో ముచ్చటించి ఉచిత బస్సు ప్రయాణంతో వాళ్లకు చెందుతున్న లబ్ధి, అందుతున్న సౌకర్యాలు గురించి ఆప్యాయంగా పలకరిస్తూ తెలుసుకున్నారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే రంగారెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రజనీకాంత్ గౌడ్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించే వ్యక్తి ఎమ్మెల్యే రంగారెడ్డి అని అలాంటి వ్యక్తిపై వక్రబుద్ధితో తప్పుడు ఆలోచనలతో సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా వ్యవహరించడం తగదని, ఇప్పటికైనా చిల్లర చేష్టలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

**రాజకీయ భవిష్యత్తు లేని కారణంగానే తప్పడు ప్రచారాలు...**

గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీకి దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజల సంక్షేమం అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేనటువంటి వ్యక్తులని దుయ్యబట్టారు. ఈరోజు ప్రజాసంక్షేమం కోసం అభివృద్ధి కోసం పాటుపడుతున్న నాయకుల పట్ల తప్పుడు ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాబోయే రోజుల్లో రాజకీయ భవిష్యత్తు కోల్పోతున్నామనే ఉద్దేశంతో ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్నారని పల్లె రజనీకాంత్ గౌడ్ మండిపడ్డారు.

**రాజకీయ భవిష్యత్తు లేదనే దురుద్దేశంతో తప్పడు ప్రచారాలు.!**

మహిళల పట్ల గౌరవం లేని వ్యక్తులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, రజినీకాంత్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల గౌరవం లేని వ్యక్తులే తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని, ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే పట్ల దుష్ప్రచారాలు చేస్తూ, సమాజంలో మహిళల గౌరవాన్ని దిగజార్చే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన అన్నారు.

# ఆర్ బీఐ బిగ్ షాక్

**ముంబై, మహా** : భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచి కస్టమర్లకు షాక్ ఇచ్చింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దాంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. అక్టోబర్ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూడు రోజులపాటు సమావేశమై పలు విషయాలపై సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ద్రవ్యోల్బణ ప్రమాదం, ముడి చమురు, ధరల పెరుగుదల, గ్లోబల్ ఆర్థిక ఒత్తిడులు వంటి అంశాలపై చర్చించారు. 2023 ఫిబ్రవరి తరువాత వడ్డీ రేట్లను పెంచడం ఇదే తొలిసారి. మూడున్నరేళ్ల కిందట ఆర్ బీఐ రెపో రేటును పెంచింది. ఆ సమయంలో రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25%) పెంచి 6.50 శాతానికి తీసుకెళ్లింది. ఆ తర్వాత డిసెంబర్ 2024 వరకు రెపో రేటును అలాగే కొనసాగించారు. ఆపై 2025లో పరిస్థితులు కాస్త మెరుగుపడటంతో కేంద్ర బ్యాంక్ రెపో రేటును మొత్తం 4 విడతల్లో 125 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 5.25 శాతానికి దిగొచ్చింది. డిసెంబర్ 2025 తర్వాత ఇప్పటివరకు అంటే దాదాపు 10 నెలల పాటు రెపో రేటును అలాగే కొనసాగించిన తర్వాత, తాజాగా రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యోల్బణం వల్ల రెపో రేటు పెంచింది. ఫిబ్రవరి 2025లో 25 బేసిస్ పాయింట్లు కోత విధించారు. దీంతో 5 ఏళ్ల విరామం తర్వాత మొదటిసారిగా ఆర్ బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దాంతో రెపో రేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి దిగొచ్చింది. ఏప్రిల్ 2025లో 25 బేసిస్ పాయింట్లు రెండోసారి కోత విధించడంతో రెపో రేటు 6 శాతానికి తగ్గింది. జూన్ 2025లో 50 బేసిస్ పాయింట్ల మూడోసారి కోత విధించడంతో రెపో రేటు 5.50 శాతానికి చేరుకుంది. ఆ తరువాత డిసెంబర్ 2025లో నాలుగో కోత విధించారు. చివరిసారి రెపో రేటులో 25 బేసిస్ పాయింట్ల కోత విధించడంతో 5.25 శాతానికి దిగిరావడంతో వడ్డీలు చెల్లిస్తున్న వారికి ఊరట కలిగింది.




**రేపో రేటు పెంచడం వల్ల ఏం జరుగుతుంది**

రేపో రేటు పెంచడం వల్ల బ్యాంక్ లోన్స్ మరింత ఖరీదు కానున్నాయి. ఎందుకంటే ఆర్ బీఐ ఇతర బ్యాంకులకు అప్పు ఇచ్చే రేటునే రెపో రేటు అంటారు. ఇప్పుడు బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ నుండి లోన్ తీసుకోవడం మరింత బారంగా మారుతుంది. దాంతో వాటికి ఫండ్స్ ఖర్చు పెరగడం వల్ల బ్యాంకులు కస్టమర్లపై హోమ్ లోన్, కార్ లోన్ సహా పర్సనల్ లోన్‌లపై వడ్డీ రేట్లను పెంచుతాయి. కనుక రెపో రేటు పెరిగితే, వడ్డీ రేట్లు పెరిగి.. గతంతో పోలిస్తే ఈఎంఐపై ఎక్కువ ఖర్చు అవుతుంది. మీరు ఒకవేళ ఫ్లోటింగ్ రేట్ పై లోన్ తీసుకుని ఉంటే బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచడంతో పాటు మీ లోన్ నెలవారీ ఈఎంఐ చెల్లింపు మొత్తం కూడా పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో బ్యాంకులు ఈఎంఐ స్థిరంగా ఉంచి లోన్ చెల్లింపు మొత్తం వ్యవధిని సైతం పెంచుతాయి. అయితే, లోన్ తీసుకునే సమయంలో మీరు ఫిక్స్ డ్ రేట్ సెలక్ట్ చేసుకున్న కస్టమర్లపై ఆర్‌బీఐ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపదు.

**ఎఫ్ డీలపై అధిక వడ్డీ**

రెపో రేటు పెరిగితే మీ ప్రతి నెలా చెల్లించే ఈఎమ్ఐ పెరిగినప్పటికీ, దీనివల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. రెపో రేటు పెరగడం వల్ల బ్యాంకుల్లో ఫిక్స్డ్ డిపాజిట్ చేసే కస్టమర్లకు లబ్ధి చేకూరుతుంది. దీనివల్ల డిపాజిటర్లకు అధిక వడ్డీ లభిస్తుంది. ఈఎంఐ ఎంత మేర పెరుగుతుంది రెపో రేటులో ఈ 0.25 శాతం (25 బేసిస్ పాయింట్లు) పెంపు వల్ల మీ బ్యాంక్ లోన్లపై వడ్డీ రేట్లు కూడా 0.25 శాతం పెరుగుతాయి. ఒకవేళ మీరు తీసుకున్న 50 లక్షల హోమ్ లోన్‌పై మీ ఈఎంఐలో దాదాపు రూ. 780 నుంచి రూ. 817 వరకు పెంపు ఉండవచ్చు. ప్రస్తుత వడ్డీ రేటును 7.50 శాతంగా భావిస్తే, రెపో రేటు 0.25 శాతం పెరిగిన తర్వాత అది 7.75% అవుతుంది. ఆ పరిస్థితిలో 20 ఏళ్లకు తీసుకున్న 50 లక్షల హోమ్ లోన్‌పై ప్రస్తుత రెపో రేటు ప్రకారం ఈఎమ్ఐ రూ. 777 మేర పెరుగుతుంది. గతంలో 7.50 శాతం వడ్డీ రేటు వద్ద నెలకు 40,280 రూపాయలు చెల్లించే వారు. ఇకనుంచి నెలవారీ ఈఎంఐ 41,057 కట్టాల్సి వస్తుంది. ఒకవేళ మీరు 50 లక్షల హోం లోన్ తీసుకుని, 25 ఏళ్లు టర్మ్ అయితే 7.50 శాతం వడ్డీ రేటు వద్ద ఈఎంఐ రూ. 37,766 అవుతుంది. ఇది గతంలో 7.50 వాతం వడ్డీ రేటు వద్ద రూ. 36,950 చెల్లించేవారు. రెపో రేటు మార్చిన ప్రతి సారి మీరు చెల్లించే వడ్డీ రేట్లు పెరుగుతాయి.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

ప్రజాసేవను పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభినందిస్తూ, ఆయన తెచ్చిన సంస్కరణలను కొనియాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రివర్గం ఏకగ్రీవ తీర్మానం చేసిందని మంత్రి తెలిపారు. వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించి మంత్రివర్గం రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. విధి నిర్వహణలో ఉండగానే మరణించిన అర్హత కలిగిన ఆశా (ASHA) కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు గ్రాట్యుటీ అమలుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వారు అందించిన ప్రతి ఏటా సేవకు రూ.5 వేల చొప్పున గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు గ్రాట్యుటీ అందించాలని నిర్ణయించారు. దీనితో పాటు బాపట్ల జిల్లా రేపల్లెలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను (సీహెచ్‌సీ) అత్యాధునిక వసతులతో కూడిన 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందుకు అవసరమైన రూ.58.42 కోట్ల నిధులతో పాటు అదనంగా 66 ఉద్యోగ పోస్టుల మంజూరుకు అనుమతులు మంజూరు చేసింది.

పాఠశాల, ఉన్నత విద్యా రంగాల్లో సమూల మార్పులు తెచ్చేలా పలు ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం పలికింది. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి 'తల్లికి వందనం' పథకం మార్గదర్శకాలు, పరిపాలనా అనుమతులకు మంత్రివర్గం రాటిఫికేషన్ ఇచ్చింది. అదనంగా మరో 58,060 మంది విద్యార్థులను చేర్చడంతో ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారి సంఖ్య ఏకంగా 68,57,880కి చేరింది. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల డైట్ ఛార్జీల పెంపునకు సంబంధించిన గత ఉత్తర్వులను మంత్రివర్గం ఆమోదించింది. విశాఖపట్నం మరికవలసలో గిరిజన విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీజేఈఈ, నీట్‌లకు అత్యాధునిక శిక్షణ ఇచ్చేందుకు 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించారు. విద్యార్థుల సిలబస్‌ను నిరంతరం పర్యవేక్షించేలా ఏపీ విద్యా చట్టం 1982కు సవరణలు చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిష్టాత్మక విదేశీ ఉన్నత విద్యాసంస్థలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల స్థాపనను ప్రోత్సహించే సరికొత్త విధానం 'నూతన పాలసీ2026'కు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఉద్యాన రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానించే లక్ష్యంతో రూ.20.62 కోట్ల వ్యయంతో 72 నెలల పాటు అమలు చేసేందుకు 'ఏపీ హార్టికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ప్రాజెక్టుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రజా ప్రయోజనార్థం పలు భూ కేటాయింపులకు సైతం ఆమోదం లభించింది. కుప్పం ప్రాంత అభివృద్ధి సంస్థ (కుడా) అధికారుల అతిథి గృహం కోసం 1.69 ఎకరాల భూమి వర్గీకరణ మార్పునకు, వైఎస్సార్ కడప జిల్లా పాతూరులోని ఆలయ అభివృద్ధికి 7.66 ఎకరాల ప్రభుత్వ భూమిని దేవాదాయ శాఖకు బదలాయించేందుకు, ప్రకాశం జిల్లా కొండపిలో బాలుర రెసిడెన్షియల్ స్కూల్, హాస్టల్ నిర్మాణం నిమిత్తం 7 ఎకరాల భూమి వర్గీకరణ మార్పునకు ఆమోదం లభించింది. గ్రామాల నుంచి నగరాలకు వలస వచ్చిన పేదలు నివాసముంటున్న ప్రభుత్వ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమానికి అనుగుణంగా, ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ ఉత్తర్వులకు ఏపీ మంత్రివర్గం రాటిఫికేషన్ ఇచ్చింది.




# రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రచారం.!

- **ఎమ్మెల్యే తప్పడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి**
- **మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం**
- **యాచారం పిఎస్ లో కాంగ్రెస్ మండల కమిటీ ఫిర్యాదు...**

**యాచారం అక్టోబర్ 7 మహా**: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ విద్యార్థులు, మహిళలతో మాట్లాడిన దృశ్యాలను వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ యాచారం మండల పార్టీ అధ్యక్షుడు మోటే శ్రీశైలం, సీనియర్ నాయకులు బుధవారం యాచారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మోటే శ్రీశైలం మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు తీరును తెలుసుకునేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బొంగ్లూర్ ఓఆర్ఆర్ వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని తెలిపారు. ప్రయాణ సమయంలో మహిళలు, విద్యార్థులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడిన దృశ్యాలను కొంతమంది వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

**రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రచారం...**

కదులుతున్న బస్సులో చోటుచేసుకున్న కొన్ని దృశ్యాలను తీసుకుని బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఒక న్యూస్ ఛానల్ ఈ ఘటనను ప్రచారం చేసిన తీరును తీవ్రంగా ఖండించారు. తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్న సోషల్ మీడియా ఖాతాలను గుర్తించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మోటే శ్రీశైలం, పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ముత్యాల వెంకట్ రెడ్డి, సర్పంచ్ కేశమోని రాజు, కిషన్ నాయక్, మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, దూస రమేష్ గుంగల్ ఉప సర్పంచ్ మచ్చ అనిల్ మాజీ ఎంపీటీసీ మాదవి మల్లేష్ ఉప్పల భాస్కర్, యాచారం గ్రామ అధ్యక్షుడు రాజి రెడ్డి, రెడ్డీ వెంకట్ రెడ్డి, బుచ్చయ్య, తక్కళ్ల పెల్లి గ్రామ అధ్యక్షుడు తులసి తదితరులు పాల్గొన్నారు.



# అద్వానీ ఆశీస్సులు తీసుకున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, మహా :** ప్రభుత్వాధినేతగా పాతికేళ్ల సుదీర్ఘ అధికార ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. భారతీయ జనతా పార్టీ అగ్ర నేత, 'భారతరత్న' ఎల్.కే. అద్వానీతో భేటీ అయ్యారు. బుధవారం ఢిల్లీలోని అద్వానీ నివాసానికి వెళ్లిన ప్రధాని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు సంబంధించిన ఛాయా చిత్రాలను ప్రధాని మోదీ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా దేశ ప్రజలతో పంచుకున్నారు. అద్వానీ నివాసానికి చేరుకున్న ప్రధానమంత్రికి అక్కడ ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ప్రజాసేవలో అద్వానీ అందించిన దశాబ్దాల సేవలను ప్రధాని మోదీ ఘనంగా కొనియాడారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన అపారమైన కృషి చరిత్రలో చెరగని ముద్ర వేసిందని ప్రశంసించారు. భారతదేశ పురోగతిని బలోపేతం చేయడంలో, జాతి నిర్మాణంలో అద్వానీ అత్యంత కీలకమైన పాత్ర పోషించారని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పాతికేళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న చరిత్రాత్మక తరుణంలో.. తన రాజకీయ గురువు, పార్టీ కురువృద్ధుడిని స్వయంగా కలిసి ఆశీస్సులు తీసుకోవడం పట్ల బీజేపీ శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వీరి భేటీకి సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# కోట్లాది భారతీయుల నమ్మకమే బలం

**న్యూఢిల్లీ, మహా:** ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కోట్లాది భారతీయులు తనపై ఉంచిన అచంచల విశ్వాసమే తన అసలైన బలమని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని సరోజినీ నగర్ శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రారంభమైన తన ప్రజా జీవిత ప్రయాణాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. ప్రజల ఆశీస్సులు, బీజేపీ కార్యకర్తల కృషి తన ఎదుగుదలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశ సేవే తన జీవిత ధ్యేయమని స్పష్టం చేశారు. గత 25 ఏళ్ల అనుభవం దేశ ప్రజలకు అంకితమని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించడమే లక్ష్యమని, భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలపడంతో పాటు స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తానని మోదీ వెల్లడించారు.

# పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తా

- **ఈసీని బద్నాం చేయడం తగదు.**
- **కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజం.**

**కరీంనగర్,మహా** : తెలంగాణ భాజపాలో తనకు త్వరలో కీలక బాధ్యతలు అప్పగిస్తారంటూ వస్తున్న ప్రచారాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. భారతీయ జనతా పార్టీ తనకు ఎన్నో ఉన్నతమైన పదవులు, అవకాశాలు కల్పించిందని, తాను ఎన్నడూ పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఏ బాధ్యత అప్పగించినా ఒక క్రమశిక్షణ గల సైనికుడిలా శిరసావహించి పనిచేస్తానని, నిరంతరం కార్యకర్తగానే పార్టీ అభ్యున్నతికి శ్రమిస్తానని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాధినేతగా పాతికేళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా భాజపా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సేవా జ్యోతి' ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ భూ వివాదాలపై విచారణలు, చర్యలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలన్నీ ఒట్టి డ్రామాలేనని కొట్టిపారేశారు. గత ప్రభుత్వంలో జరిగిన భారీ అవినీతిపై కఠిన చర్యలు తీసుకునే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, అలాగే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై నిలదీసే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. ఈ రెండు పార్టీల మధ్య తెరవెనుక చీకటి ఒప్పందాలు సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. 2014కు ముందు దేశంలో నెలకొన్న అవినీతి పాలనను, నేటి నవ భారత ప్రగతిని పోల్చి చూసి యువత వాస్తవాలను గ్రహించాలని, విపక్షాల అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీకి కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాల వ్యామోహం లేదని.. 2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా తీర్చిదిద్దడమే ఆయన ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘంపై విపక్షాలు చేస్తున్న ఆందోళనలను కేంద్ర మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. దేశంలో 'ఓట్ చోరీ.. సీట్ చోరీ' అనేది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని మండిపడ్డారు. 1946లోనే మెజారిటీ పీసీసీలు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ప్రధాని కావాలని తీర్మానించినప్పటికీ, ఆయనను కాదని నెహ్రూను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది కాదా అని ప్రశ్నించారు. గతంలో దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని స్వయంగా కాంగ్రెస్ నేతలే ఆరోపించారని, ఇప్పుడా దొంగ ఓట్లను తొలగించేందుకు ఎన్నికల సంఘం సవరణ ప్రక్రియ చేపడితే ఎందుకు గగ్గోలు పెడుతున్నారని నిలదీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, అనర్హుల బోగస్ ఓట్లను తొలగించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని వివరించారు.ఎన్నికల సంఘం అనేది రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ అని, అది ఎవరి జేబు సంస్థ కాదని బండి సంజయ్ స్పష్టం చేశారు. అటువంటి ఉన్నత వ్యవస్థలను రోడ్డుకీడ్చి బద్నాం చేయడం ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదకరమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ నిజంగా సమస్యలు విన్నవించాలనుకుంటే సీఈసీ అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లాలని, అలా కాకుండా వందల మందితో దాడులు చేసేలా ర్యాలీలు నిర్వహిస్తే శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించిన ఆయన, ఒక్క మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని, ఇలాంటి అక్రమాలను అరికట్టడం రాజ్యాంగబద్ధ కర్తవ్యమని పేర్కొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
గురువారం, హైదరాబాద్
08-10-2026



# ఎన్నికల సంఘంపై రణం

## జంతర్ మంతర్ లో జగడం

## రాహుల్ ను కలిసిన సీఎంలు రేవంత్ రెడ్డి , సతీశన్

## జ్ఞానేశ్ దిగేదాకా.. పోరాటమే



మహా : రెండోరోజు ఢిల్లీ దద్దరిల్లింది. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ రణరంగానికి సై అంది. రాహుల్ నాయకత్వంలో విపక్షం రాజీలేని పోరాటం సాగిస్తోంది. బారకంబా పీఎస్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్ కలిశారు. గతంలో ఎన్నికల్లో గెలవడానికి ఈడీ,సీబీఐని వాడేవారని ఇప్పుడు ఏకంగా ఈసీని దుర్వినియోగం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇది కాంగ్రెస్ సమస్య కాదని దేశ ప్రజల సమస్యన్నారు. అంతకు మందు రాహుల్ గాంధీని అరెస్ట్ చేసిన పోలీసులు బారకంబా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పీఎస్‌కు చేరుకున్నాయి. ఆందోళనలతో ఢిల్లీ అట్టుడుకుతోంది. దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటుతున్నాయి. ఓ వైపు విపక్షాలు ఢిల్లీని దడదడలాడిస్తుండగా, మరోవైపు సీజేపీ బెంగళూరులో గురువారం భారీ ఆందోళనకు సిద్ధమైంది. 10వ తేదీన ఛలో ఢిల్లీకి పిలుపునిచ్చింది.















# చామనపల్లి ముంపు సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు

- బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి
- గ్రామంలో పర్యటించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు: మంత్రి

**పెద్దపల్లి మహా** : ధర్మారం: నందిమేడారం రిజర్వాయర్ సామర్థ్యం పెంపు నేపథ్యంలో తలెత్తిన చామనపల్లి గ్రామ ముంపు సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. నంది రిజర్వాయర్ నీటి మట్టాన్ని 2 టీఎంసీలకు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్న తరుణంలో గ్రామంలోని ఇళ్లకు ముంపు ముప్పు ఏర్పడింది. ఈ నేపథ్యంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం చామనపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ముంపు బాధితులు, గ్రామ ప్రజలతో మంత్రి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు తమ ఇళ్లకు, ఆస్తులకు ఏర్పడుతున్న ముంపు ముప్పు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి గ్రామంలోని ముంపు ప్రభావిత ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చామనపల్లి ముంపు సమస్యను ఏ నాయకుడూ పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చామనపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రతను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో ముంపు బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి వెల్లడించారు. బాధితులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు.ముంపు బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మానవత్వమేమనిషినిజమైనచిరునామా

- డ్రైవర్ సదానందం కుటుంబానికి ఉద్యోగుల జేఏసీ రూ.3.65 లక్షల ఆర్థిక సాయం

**కరీంనగర్ మహా** : ఆపదలో ఉన్న సహోద్యోగి కుటుంబానికి అండగా నిలిచి కరీంనగర్ జిల్లా ఉద్యోగులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా కలెక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సదానందం సతీమణి నీరజాక్షి ఇటీవల ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడి కరీంనగర్‌లోని రెనే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో విషాదంలో ఉన్న సదానందం కుటుంబానికి జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సమకూర్చిన రూ.3.65 లక్షల ఆర్థిక సహాయాన్ని బుధవారం తిమ్మాపూర్‌లోని వారి నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.



**చిన్న ఉద్యోగి నుంచి అధికారి వరకు స్పందన**

జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు సదానందం కుటుంబాన్ని పరామర్శించి, వారి దుఃఖంలో పాలు పంచుకున్నారు. నీరజాక్షి దశదినకర్మ సందర్భంగా ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే కుటుంబానికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అవసరమని గుర్తించిన ఉద్యోగ సంఘాల నాయకులు వివిధ ఉద్యోగ సంఘాల గ్రూపుల ద్వారా సహాయం కోసం విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన చిన్న ఉద్యోగి నుంచి అధికారి వరకు తమవంతు సహకారం అందించారు. ఫోన్‌పే, గూగుల్ పే తదితర మార్గాల్లో రూ.3.65 లక్షలు సమకూరాయి.

**ఆపదలో అండగా నిలవడమే ఉద్యోగ ఐక్యత**

ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి, మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ మాట్లాడుతూ.. ఉద్యోగి అంటే కేవలం ఒక సభ్యుడు కాదని, ఒక కుటుంబ సభ్యుడని అన్నారు. ఆ కుటుంబంలో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు 'అది వారి సమస్య' అని పక్కకు తప్పుకోకుండా 'మనవంతుగా ఏం చేయగలం' అని ముందుకు రావడమే నిజమైన ఉద్యోగ ఐక్యతకు అర్థమని పేర్కొన్నారు. వైద్య చికిత్స కోసం సదానందం కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని, అప్పులు చేసి తమవంతు ప్రయత్నం చేసినప్పటికీ నీరజాక్షిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు.

**ఉద్యోగుల మానవతా స్పందనకు అభినందనలు**

టీఎన్జీవో అసోసియేషన్, టీజీవో అసోసియేషన్, డ్రైవర్స్ అసోసియేషన్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ అసోసియేషన్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ట్రెజరీ అసోసియేషన్, పంచాయతీరాజ్ సెక్రటరీ అసోసియేషన్, హాస్టల్ వార్డెన్స్ అసోసియేషన్, పశుసంవర్ధక శాఖతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి సహాయం అందించడం అభినందనీయమన్నారు. సహాయం చేసిన ప్రతి ఉద్యోగికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 'సహాయం చేసిన ప్రతి రూపాయి వెనుక ఒక ఉద్యోగి మంచి మనసు ఉంది. ప్రతి స్పందన వెనుక ఒక కుటుంబం పట్ల ఉన్న ఆప్యాయత ఉంది. మనమంతా ఒకే ఉద్యోగ కుటుంబం అనే భావనతోనే ఈ సహాయం సాధ్యమైంది' అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఉద్యోగ కుటుంబంలో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు తమకు సాధ్యమైనంత మేరకు అండగా నిలుస్తామని తెలిపారు. సదానందం కుటుంబానికి ఈ కష్టకాలంలో ఉద్యోగ కుటుంబం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నీరజాక్షి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, టీఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎడ్ల అరవింద్ రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, రాష్ట్ర నాయకులు సర్దార్ హర్మేందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వారిస్ సవాబ్, నాయకులు మంజీత్ సింగ్, అనంత్ రెడ్డి, అన్వర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## జూలూరుపాడు లో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్కె చాంద్ పాషా డిమాండ్ చేశారు. మండల వ్యాప్తంగా కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు సుమారు 50 మందికి పైగా ఉన్నారని, వారికి తక్షణ వైద్య సేవలు అందక నాన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకునే స్తోమత లేక మృత్యువు ఒడికి చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నానా శ్రమ కోర్చి జిల్లా కేంద్రాలైన కొత్తగూడెం లేదా ఖమ్మం ఆసుపత్రులను ఆశ్రయించితే బెడ్లు ఖాళీగా లేవని రోగులను వెనక్కి తిప్పి పంపుతున్న దౌర్భాగ్యస్థితి నెలకొందని అన్నారు. మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సరైన సమయంలో డయాలసిస్ అందక గత 3 సంవత్సరాలలో పదుల సంఖ్యలో రూగులు చనిపోయారని గుర్తు చేశారు. కావున పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి ఏజెన్సీ మండలమైన జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని చాంద్ పాషా డిమాండ్ చేశారు.

## గెస్ట్ ఎడ్యుకేటర్ల పోస్టులు నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**పెద్దపల్లి మహా,** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు పెద్దపల్లి జిల్లాలోని 11 పి.ఎం. శ్రీ పాఠశాలల్లో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్స్ నియామకానికి అర్హులైన, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నియామకాలను ఐదు నెలల కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పి.ఎం. శ్రీ రామగుండం, జడ్.పి.హెచ్.ఎస్. కమాన్‌పూర్, జడ్.పి.హెచ్.ఎస్. అప్పన్నపేట, జడ్.పి.హెచ్.ఎస్. పోత్కపల్లి, జడ్.పి.హెచ్.ఎస్. ఏక్లాస్‌పూర్, టి.జి.డబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్. మేడారం, టి.జి.డబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్. మల్లాపూర్, టి.జి.ఎం.ఎస్. రామగుండం, టి.జి.ఎం.ఎస్. జూలపల్లి, టి.జి.ఎం.ఎస్. మల్యాల్ (శ్రీరాంపూర్), టి.జి.డబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్. మంథని పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తుతో ఈ నెల 10వ తేదీలోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ప్రిన్సిపాళ్లకు సమర్పించాలని సూచించారు. అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన ధ్రువపత్రాలు తదితర పూర్తి వివరాల కోసం సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని డీఈఓ జి. శారద సూచించారు.





# నాగారం మెయిన్‌రోడ్డులో రూఫ్‌టాప్ సెల్‌ఫోన్ టవర్‌పై ఫిర్యాదు

**కుషాయిగూడ, మహా**: నాగారం మెయిన్‌రోడ్డులో రాందేవ్ జువెలరీస్ పక్కన ఉన్న భవనంపై కొత్తగా రూఫ్‌టాప్ సెల్‌ఫోన్ టవర్ నిర్మిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. టవర్ నిర్మాణంతో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటూ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. బలమైన గాలులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో టవర్ లేదా దానికి సంబంధించిన పరికరాలు కిందపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమీప నివాసితుల ఆరోగ్యంపై కూడా సందేహాలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టవర్‌కు సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిర్మాణ భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక భద్రతా నిబంధనలు, విద్యుదయస్కాంత క్షేత్ర (ఈఎంఎఫ్) నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను అధికారులు పూర్తిగా పరిశీలించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ప్రమాదకరంగా ఉన్నట్లయితే టవర్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాగులు, సామాజిక కార్యకర్త అక్కల సురేశ్‌కుమార్, స్థానికులు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



## చెత్తగుట్టలకు నిలయాలుగా... జవహర్ నగర్ కాలనీలు

**అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న నివాసితులు**

**ఇది మారుతీ నగర్ కాలనీ దుస్థితి**

జవహర్ నగర్ మహా : చెత్తగుట్టలకు నిలయాలుగా జవహర్ నగర్ లోని పలు కాలనీలు నిలుస్తున్నాయని మారుతీ నగర్ కాలనీ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రపురి కాలనీ 2 మారుతి నగర్ ప్రాంతంలో పేరుకు పోయిన చెత్తాచెదారం కారణంగా స్థానికులు తీవ్రమైన దుర్వాసనను ఎదుర్కొంటున్నారని ఫలితంగా అనారోగ్యాల పాలవుతున్నారని ప్రజలు వాపోతున్నారు ఎన్నిసార్లు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎలాంటి ఫలితం లేదని మీడియా వద్ద స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి కుక్కల బెడదతో పిల్లలు బయటికి రావాలన్న భయపడే పరిస్థితి నెలకొంది అన్నారు. ఈ సమస్యపై సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్ మాట్లాడుతూ తక్షణమే చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. కాలనీవాసి శ్రీవిద్య మాట్లాడుతూ దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నామని పిల్లలు బయటకు రావడానికి కుక్కల భయంతో వనికి పోతున్నారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మునిసిపల్ సిబ్బంది కాలనీలోని చెత్తను డ్రైనేజీ సమస్యల ను పరిష్కరించి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా రక్షించాలని వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మంజుల, హేమావతి, చంద్రకళ, మీనాక్షమ్మ, సరస్వతీ, శంకరమ్మ, సురేష్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు



## సైబర్ మోసాలకు చెక్ పెట్టాలంటే అప్రమత్తతే ఆయుధం

- ఆగండి.. ఆలోచించండి.. సరిచూసుకోండి
- 1930కు వెంటనే ఫిర్యాదు చేయండి: సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ మహా** : సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మార్గాన్ని ఎంచుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని, వారి వలలో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండటమే రక్షణ కవచమని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. అనుమానాస్పద లింకులను తెరవడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పడం వంటి తప్పిదాలతో భారీగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన 'పాజ్ ఫర్ సేఫ్టీ.. ఆగండి.. ఆలోచించండి.. సరిచూసుకోండి' అవగాహన పోస్టర్‌ను బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆస్ట్రా కన్వెన్షన్‌లో సీపీ ఆవిష్కరించారు. అనంతరం సైబర్ మోసాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉద్యోగం.. రుణం.. షాపింగ్.. అన్నింట్లోనూ మోసాలే వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో తక్కువ శ్రమకు ఎక్కువ ఆదాయం వస్తుందని చెప్పే ఉద్యోగ ఆఫర్లను నమ్మవద్దని సీపీ సూచించారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ ముందస్తుగా రిజిస్ట్రేషన్ ఫీజు అడిగితే అది మోసంగా గుర్తించాలని తెలిపారు. తక్షణ రుణాల పేరుతో వచ్చే గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని, అవి ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, పరిచయ వివరాలను సేకరించి వేధింపులకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే భారీ డిస్కౌంట్ల పేరుతో సామాజిక మాధ్యమాల్లో వచ్చే నకిలీ వెబ్‌సైట్‌లను నమ్మి ముందుగానే డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, ఇతర ప్రభుత్వ అధికారులమంటూ ఫోన్ చేసి బెదిరించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, పాస్‌వర్డ్, ఏటీఎం, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచితులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.

**మోసపోతే ఆలస్యం వద్దు**

సైబర్ మోసానికి గురైన వెంటనే స్పందించడం అత్యంత కీలకమని సీపీ తెలిపారు. బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తత కూడా కీలకమని గౌష్ ఆలం అన్నారు. ఏదైనా అనుమానాస్పద సందేశం లేదా లింక్ వస్తే ముందుగా ఆగాలి.. ఆలోచించాలి.. నిజానిజాలు సరిచూసుకున్న తర్వాతే స్పందించాలి అని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు, సైబర్ విభాగం ఎస్సైలు అనూష, పోలీస్ సిబ్బంది, ఎస్ఆర్ జూనియర్ ప్రైవేట్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## శంషాబాద్ ఎయిర్పోర్టులో 2.25 కోట్ల అక్రమ బంగారం పట్టివేత

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అక్రమంగా తరలిస్తున్న 1.481,780 గ్రాముల భారీ విదేశీ బంగారాన్ని పట్టుకున్నారు. కువైట్, సౌదీ అరేబియా (జెడ్డా) నుంచి వచ్చిన విమానాల్లో కొందరు ప్రయాణికులు అక్రమంగా బంగారాన్ని తీసుకువస్తున్నట్లు పక్కా సమాచారంతో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. స్మగ్లర్లు అధికారుల కన్నుగప్పేందుకు ఇనుములో బంగారాన్ని అత్యంత చాకచక్యంగా దాచి తరలిస్తుండగా అనుమానంతో లగేజ్ను తనిఖీ చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. టనలకు సంబంధించి పలువురు నిందితులను రెవిన్యూ ఇంటెలిజెంట్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తిరుచ్చిరాపల్లి నుంచి వచ్చిన ఒక నగల వ్యాపారి వద్ద 1.20 కోట్ల విలువైన బంగారం పట్టుబడింది. కేసు నమోదు చేసిన రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.




## మూసీ భూసేకరణలో 60:40 నిష్పత్తి అమలు చేయాలి

- ప్రతాప సింగారంలో ఎకరాకు రూ.1,750 చ. గజాలు ఇస్తున్నారని వెల్లడి

**కుషాయిగూడ, మహా** : మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రాజెక్టులో భూసేకరణ, భూ యజమానులకు కల్పించాల్సిన ప్రయోజనాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌తో భేటీ అయ్యారు. ప్రాజెక్టు పరిధిలోని భూ యజమానులు, రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఏరియాలో ల్యాండ్ పూలింగ్ అమలుకు సంబంధించి సెప్టెంబర్ 19న జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 240లోని అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. పట్టా భూములు, బఫర్ ఏరియా, నదీ పరీవాహక ప్రాంతం, ఎఫ్‌టీఎల్, అసైన్డ్, ప్రభుత్వ భూములు తదితర విభిన్న రకాల భూములు ప్రాజెక్టు పరిధిలో ఉన్నందున, ఆయా భూ యజమానులు, రైతులు, బాధితుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా భూ యజమానులకు అభివృద్ధి చేసిన స్థలాలు, డెవలప్ చేయగల భూమి కేటాయింపు, పరిహారం, స్టాంపు డ్యూటీ తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతాప సింగారం వద్ద భూ యజమానులకు ఎకరాకు 1,750 చదరపు గజాల ప్రయోజనం కల్పిస్తున్నారని, తమ ప్రాంతంలోని భూ యజమానులకు 1,400 చదరపు గజాలు ఇవ్వాలని కోరారు. 60:40 నిష్పత్తి ప్రకారం ప్రయోజనాలు కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా, భూ యజమానుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ న్యాయబద్ధంగా, పారదర్శకంగా చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సల్ల వీరారెడ్డి, పంగా మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్యాధికారితో ఎమ్మెల్యే భేటీ ఇదిలా ఉండగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆనంద్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య సేవలు, ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలు, ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక వసతులు, ప్రజారోగ్య సమస్యలపై చర్చించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# ఆవిష్కరణ , పరిశోధన ప్రయత్నాలు సమాజ విస్తృత లక్ష్యాలకు మద్దతు ఇవ్వాలి

- డాక్టర్. సీహెచ్ వి పురుషోత్తం రెడ్డి

**మొయినాబాద్ మహా**: మున్సిపాలిటీ హిమాయత్ నగర్‌లో గల చైతన్య డీమ్డ్ టూ బి యూనివర్సిటీ లో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో బి యస్ దీప పరిశోధన ఆధారంగా పీహెచ్‌డి డిగ్రీ అందించడం జరిగింది. ఆమె ఇంపాక్ట్ అఫ్ ఫైనాన్సియల్ లిటరసీ ఆన్ సేవింగ్స్ అండ్ ఇన్వెస్టుమెంట్ పాటర్న్ అఫ్ ఎంప్లాయెడ్ విమెన్ ఏ స్టడీ అఫ్ సెలెక్ట్ ఏరియాస్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధనను ఆచార్య జి. ఉష శ్రీ పర్యవేక్షణలో పూర్తి చేశారు ఈ ప్రతిష్టాత్మక పీహెచ్‌డీ డిగ్రీని విశ్వవిద్యాలయ ఫౌండర్ & చాన్సలర్ డాక్టర్ సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగంలో చేపట్టే పరిశోధనలు రాష్ట్ర, దేశ అభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఉద్యోగినుల పొదుపు మరియు పెట్టుబడి సరళిపై ఆర్థిక అక్షరాస్యత ప్రభావం అనే అంశంపై చేపట్టిన ఈ పరిశోధన సమాజానికి, ముఖ్యంగా మహిళల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడే విలువైన పరిశోధనగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ పరిశోధన ద్వారా ఆర్థిక అక్షరాస్యత, పొదుపు మరియు పెట్టుబడి విధానాలపై మరింత అవగాహన పెంపొందించడంతో పాటు, రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణంగా నిలిచే ఫలితాలను అందించాలని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఈ పరిశోధన భవిష్యత్‌లో కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ మరియు ఆర్థిక అక్షరాస్యత రంగాల్లో చేపట్టే మరిన్ని పరిశోధనలకు బలమైన పునాది వేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. సాత్విక రెడ్డి, డీన్ రీసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆచార్య క్రిస్టోపెర్, డీన్ అడ్మినిస్ట్రేషన్ ఆచార్య ఏ. రాజు, డీన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డాక్టర్ పి. సుగంధ దేవి, పరీక్షల కంట్రోలర్ ఆచార్య బి. రాజేందర్ రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ టి.వి.జి. శాస్త్రి, ఆచార్య జి. ఉష శ్రీ, మరియు అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి

- **ఆర్టీసీ సంస్థను పరిరక్షించాలని డిమాండ్**
- **ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి**
- **ఏఐటీయుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య**

**మంచిర్యాల, మహా** : తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో గేట్ వద్ద జరిగిన ద్వారా సమావేశంలో కార్మికుల ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, సంస్థ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ కు గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు అండగా నిలవాలని కోరారు.ఆర్టీసీ ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే టీఎంయూ యూనియన్ నిచ్చెన గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా రకరకాల పార్టీలు మారుతూ స్వప్రయోజనాల కోసం పనిచేసే వారిని గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం నిబద్ధతతో పనిచేసే సంఘాలకు మాత్రమే ఆర్టీసీ కార్మికులు మద్దతు ఇవ్వాలని సూచించారు. ఆర్టీసీ ప్రజా రవాణా వ్యవస్థలో కీలకమైన సంస్థ అని, దానిని ప్రైవేటీకరణ వైపు నెట్టకుండా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగులకు భద్రత కల్పించడంతో పాటు సంస్థను మరింత పటిష్టం చేయవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఎస్.కే.బాజీ సైదా, కలిందర్ అలీ ఖాన్, జోగుల మల్లయ్య, లింగం రవి, సలేంద్ర సత్యనారాయణ, భీమనాదుని సుదర్శన్, దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి అందరి సమన్వయంతో కృషి

- **రాజకీయాలకు అతీతంగా కలిసి రావాలి**
- **రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద**



**మందమర్రి, మహా** : ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలో 33 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎస్ఈ బానోత్ రాజన్న, తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, స్థానిక ప్రజా ప్రతినిధులతో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ సదుపాయాల విస్తరణ, రహదారుల అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నారు. వెంకటాపూర్ లో సుమారు 3 కోట్ల రూపాయల వ్యయంతో 33 కె.వి. సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. భూ కేటాయింపు విషయంలో కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, గ్రామ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందరి సహకారంతో సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

**గ్రామానికి 32 ఇందిరమ్మ ఇళ్లు, 38 పెన్షన్లు మంజూరు***

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామానికి 32 ఇళ్లు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా గ్రామానికి 38 పెన్షన్లు మంజూరయ్యాయని, మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

**విద్య, వైద్యానికి పెద్దపీట**

పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించిందని, నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో సీబీఎస్ఈ/రెసిడెన్షియల్ విధానంలో 2,500 మంది విద్యార్థులకు వసతితో కూడిన ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల రూపాయల వరకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందిస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు.

**రహదారుల అభివృద్ధికి 4.85 కోట్లు**

ఎంఎల్ఏ కాలనీ నుండి ఆర్కె5 వరకు 4.7 కి.మీ. రహదారి నిర్మాణానికి 4.85 కోట్ల రూపాయలు మంజూరు చేశామని, గ్రామాల్లో హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాల కోసం జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తున్నామని, ఇప్పటికే 70 మంది యువతకు శిక్షణ కొనసాగుతోందని తెలిపారు. అంతకుముందు నస్పూర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటాపూర్ గ్రామస్థుల మృతికి మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

**మందమర్రి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు**

అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులకు సంబంధించి సుమారు 15 కోట్ల రూపాయల యూఐడీఎఫ్ నిధులతో 14వ వార్డులో అభివృద్ధి పనులకు మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాయలింగుతో కలిసి శంకుస్థాపన చేశారు. త్వరలో సుమారు 40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని, అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, సీసీ డ్రైనేజీ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల అధ్యక్షులు కడారి జీవన్ కుమార్, పట్టణ అధ్యక్షులు ఎం తిరుమల్ రెడ్డి, రామ్ చందర్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటా ఇవ్వాలి

- **కార్మిక, గనుల శాఖ మంత్రికి ఎస్.సి.సి.డబ్ల్యూ.యు. (ఐ.ఎఫ్.టి.యు) వినతి**

**మందమర్రి, మహా :** సింగరేణి సంస్థకు ప్రతి సంవత్సరం వచ్చే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటా కేటాయించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎస్.సి.సి.డబ్ల్యూ.యు. (ఐ.ఎఫ్.టి.యు) ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానందకు వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం 202526 సంవత్సరానికి సంబంధించిన లాభాలను నేటి వరకు ప్రకటించలేదని అన్నారు. సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి అందులో నుండి కాంట్రాక్ట్ కార్మికులకు 10 శాతం లాభాల వాటాను కేటాయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, అయినప్పటికీ యాజమాన్యం కేవలం పర్మినెంట్ కార్మికులకు మాత్రమే పెద్ద మొత్తంలో లాభాల వాటాను కేటాయిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం వచ్చిన లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు చెల్లించిందని ఆయన పేర్కొన్నారు. సింగరేణికి వచ్చే లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ, చెమట చుక్కలు దాగి ఉన్నాయని, అతి తక్కువ వేతనాలు చెల్లించడం ద్వారానే సంస్థకు కోట్ల రూపాయల లాభాలు వస్తున్నాయని వెల్లడించారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని కాంట్రాక్ట్ కార్మికులకు కూడా 10 శాతం లాభాల వాటా కేటాయించేలా సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించాలని మంత్రి వివేకానందను కోరామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న, బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షులు టి శ్రీనివాస్, రీజియన్ నాయకులు రాయలింగు, భూమయ్య, కనకయ్య, గణేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.




# మోడీ 25 ఏళ్ల సుపరిపాలనపై సేవా సంకల్ప అభియాన్, సేవా జ్యోతి యాత్ర

- **మంచిర్యాలలో కాగడా ర్యాలీ, ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం**

**మంచిర్యాల, మహా** : ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్, సేవా జ్యోతి యాత్ర కార్యక్రమాన్ని మంచిర్యాల పట్టణంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి నరేంద్ర మోడీ లైవ్ స్పీచ్ ను వీక్షించారు. అనంతరం రైల్వే స్టేషన్ నుండి బెల్లంపల్లి చౌరస్తా వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాలీబాల్ లో జాతీయ స్థాయి కాంస్య పతకం సాధించిన రామ్మోహన్ విశిష్ట అతిథిగా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ కన్నెబోయిన ఓదెలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ ఆ తర్వాత మూడుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 2014 నుండి వరుసగా దేశ ప్రధానమంత్రిగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఏ విధమైన రాజకీయ నేపథ్యం, కుటుంబ వారసత్వం లేకుండా కేవలం అంకితభావం, కష్టపడే తత్వంతో అంచెలంచెలుగా ఎదిగి దేశాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి రోల్ మోడల్ అని కొనియాడారు. మోడీ 25 ఏళ్ల ప్రయాణం ప్రజల నమ్మకంతోనే సాధ్యమైందని, కోట్ల మంది భారతీయుల విశ్వాసమే ఆయన బలమని వెల్లడించారు. ఈ సేవా సంకల్ప వేడుకలు కేవలం గత విజయాలను గుర్తుచేసుకోవడమే కాకుండా రాబోయే కాలంలో దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపించడానికి నూతన ఉత్సాహాన్ని ఇస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎనగందుల కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తుల ఆంజనేయులు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రమణారావు, ఉపాధ్యక్షులు కోడి రమేష్, కమలాకర్ రావు, కోకన్వీనర్లు మోటపలుకుల తిరుపతి, కస్తూరి నాగరాజు, జిల్లా కార్యదర్శులు వైద్య శ్రీధర్, రాచర్ల సంతోష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బియ్యాల సతీష్ రావు, సుధీర్ గౌడ్, కార్పొరేటర్లు బోట్ల అనితా సత్యం, జోనల్ అధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు, బీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల అశోక్ వర్ధన్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు ప్రేమ్ సింగ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఈపీ ఆపరేటర్లకు ప్లే డే భత్యం చెల్లించాలి

- **61 మంది కార్మికులకు ఎనిమిది నెలలుగా అందని వేతనం**
- **జేవీఆర్ ఓసీ యాజమాన్యానికి జేఏసీ వినతి**



**సత్తుపల్లి, అక్టోబరు 7**: మహా : సత్తుపల్లి జేవీఆర్ ఓపెన్‌కాస్ట్ గనిలో 61 మంది ఈపీ ఆపరేటర్లకు పెండింగ్‌లో ఉన్న ప్లే డే మస్టర్ భత్యాన్ని వెంటనే చెల్లించాలని జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గని యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు. 2026 ఫిబ్రవరి 1న నాలుగు మస్టర్లు లేకపోవడంతో మూడు మస్టర్లలో విధులు నిర్వహిస్తున్న 61 మంది ఈపీ ఆపరేటర్లకు యాజమాన్యం ప్రత్యేక అనుమతితో ప్లే డే విధులు కేటాయించింది. అయితే విధులు నిర్వహించి ఎనిమిది నెలలు గడిచినా, ఇప్పటివరకు ఆ రోజు ప్లే డే మస్టర్ భత్యం చెల్లించలేదని కార్మికులు తెలిపారు. ఈ అంశాన్ని ఇప్పటికే గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నిర్మాణ సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించామని, డైరెక్టర్లకు సైతం వినతిపత్రాలు అందజేశామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. యాజమాన్యం ప్రత్యేక అనుమతితో విధులు నిర్వహించిన 61 మంది ఈపీ ఆపరేటర్ల ప్లే డే మస్టర్‌ను వెంటనే నమోదు చేసి, పెండింగ్ భత్యాన్ని చెల్లించాలని కోరారు. నెలల తరబడి భత్యం అందకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన భత్యాన్ని ఇకపై ఆలస్యం చేయకుండా చెల్లించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ ఆధ్వర్యంలో, గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘ నాయకులు, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, టీబీజీకేయస్ నాయకుడు రఘువీర్, హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రాతినిధ్య సంఘం ఫిట్ కార్యదర్శి సీతారామరాజు, మురళీకృష్ణ, సుధాకర్, అస్గర్‌ఖాన్, నరేందర్, పీవీ రాజు, సందీప్, ఇక్బాల్ తదితరులు, కార్మికులు పాల్గొన్నారు.




# నవ లిమిటెడ్ సేవలు ప్రశంసనీయం

- **ఇటు సేవ అటు ఉపాధి రంగంలో ముందుండడం అభినందనీయం**
- **ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**
- **నవ లిమిటెడ్ సహకారంతో "శేఖర్ బంజర కమ్యూనిటీ హాల్" ప్రారంభం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: నవ లిమిటెడ్ సంస్థ సామాజిక సేవలో ముందుండడం ప్రశంసనీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా నిర్మించిన "శేఖర్ బంజర కమ్యూనిటీ హాల్"ను బుధవారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ లిమిటెడ్ చేపడుతున్న వైద్య విద్య జీవనోపాదులు ఇతర సంఘ సేవ కార్యక్రమాలను కొనియాడారు. హెడ్ హెచ్.ఆర్ ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నవ లిమిటెడ్ సి.ఎస్.ఆర్ కార్యక్రమాల తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్ ఎం.గణేష్, డిప్యూటీ మేయర్ ఎస్. లలిత కుమారి, నవ లిమిటెడ్ లైసెన్ ఆఫీసర్ సి.వి.ఎస్.మూర్తి, హెడ్ సి ఎస్ ఆర్ డి.సుధాకర్, బానోత్ బాలు నాయక్ 33వ డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ కమిషనర్ పి.సుజాత, అధికారులు ఇతర ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, సి ఎస్ ఆర్ సిబ్బంది, కరుణాకర్ సివిల్ ఇంజనీర్ తదితరు పాల్గొన్నారు.

# తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీలే కీలకం..

- **పోషకాహారంపై ప్రతి కుటుంబం అవగాహన పెంచుకోవాలి..**
- **పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
- **అశ్వాపురంలో ఘనంగా 9వ పోషణ మాసం..**



**అశ్వాపురం/మణుగూరు, మహా** : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు పోషకాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అశ్వాపురం రైతు వేదికలో బుధవారం అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ పోషణ మాసం-మన అంగన్వాడీ.. మన బాధ్యత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు నిర్వహించిన సామూహిక శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని వారిని ఆశీర్వదించారు. తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని, గర్భధారణ సమయంలో పోషక విలువలున్న ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, స్థానికంగా లభించే పౌష్టికాహార పదార్థాల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా లభించే పోషకాహారాన్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమంలో చిన్నారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వయంగా అక్షరాభ్యాసం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. బాల్యంలోనే పిల్లలకు పోషకాహారం, విద్య, పరిశుభ్రత, మంచి అలవాట్లపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. చిన్నారుల తొలి దశ ఎదుగుదలపై తల్లిదండ్రులతో పాటు అంగన్వాడీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులకు పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడంలో అంగన్వాడీ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన అంగన్వాడీ.. మన బాధ్యత నినాదం ప్రతి కుటుంబానికి చేరేలా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వ శాఖలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పినపాక నియోజకవర్గంలో మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, పిల్లలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్ (ఎంఆర్వో), అంగన్వాడీ శాఖ అధికారులు, సిబ్బంది, మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ టీచర్ నియామకం కొరకు దరఖాస్తులు స్వీకరణ

### మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి పాపకొల్లు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు బోధించుటకు గెస్ట్ టీచర్ ను జిల్లా విద్యాశాఖ ఆదేశానుసారం విద్యాశాఖ ద్వారా నియమించుకొనుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. ఆసక్తిగల మండల పరిధి స్పెషల్ బిఈడి విద్యా అర్హత కలిగి రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆర్ సి ఐ సర్టిఫికెట్ ఫోర్సులో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులని తెలిపారు. ఈ అర్హతలు కలిగి ఆసక్తిగల మండల పరిధి నిరుద్యోగులు 081026 అనగా నేటి సాయంత్రం నాలుగు గంటల లోపు పాపకొల్లు ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు దరఖాస్తు చేసుకోవలసిందిగా మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ పత్రికా ప్రకటనలో కోరారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు

- **సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం**
- **పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, మహా :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తన్నీరు రత్తమ్మ, బెక్కం శ్రావణి, గనిబోయిన విజయ కుటుంబాలు నిర్మించుకున్న నూతన గృహాల్లో జరిగిన గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు సమకూరడం ఆనందకరమన్నారు. నూతన గృహాల్లో కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గృహ నిర్మాణ పథకాన్ని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర



సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. పినపాక నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. పేదల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని లబ్ధిదారులు ఆనందంగా గృహప్రవేశాలు చేసుకోవడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు కొత్త ఇళ్లలో ఆనందంగా జీవించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ ఏఈ, సంబంధిత శాఖల అధికారులు, మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ఓటు చోరీని అరికట్టాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని దేశాన్ని రక్షించాలని సర్ పేరుతో బిజెపికి అనుకూలంగా కొట్లాది మంది ఓట్లు తొలగించి దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ 240 మంది ప్రతిపక్ష ఎంపీలు శాంతియుతతంగా చేస్తున్న ధర్నాపై దాడి చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వై.శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్ పేరుతో సిఇసి చేస్తున్న అక్రమాలను ఆపాలని తొలగించిన అర్హులైన ఓటర్లందరిని తిరిగి ఓటర్ లిస్టులో పేర్లు చేర్చాలని అక్రమాలకు తావిస్తున్న ఈవీఎంలను రద్దుచేసి బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని సిఈసి జ్ఞానేష్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని ఓటును కాపాడాలని దేశాన్ని రక్షించాలని డిమాండ్ తో దేశవ్యాప్తంగా ఈనెల 8వ తేదీన కాంగ్రెస్ సిపిఐ, సిపిఎం ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెం పాత బస్ డిపో సెంటర్ నుండి రైల్వే స్టేషన్ సెంటర్ వరకు నిరసన పాదయాత్ర మార్చ్ ఫాస్ట్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతిపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పెద్దబాబు, లోసెట్టి నాగార్జున, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంద హనుమంతు, కాంగ్రెస్ నాయకులు బాల ప్రసాద్ పాసి, కనకం సూరిబాబు, బానోత్ రమేష్, పురుషోత్తం, చిరంజీవి, చారి తదితరులు పాల్గొన్నారు.



# వ్యాపార అభివృద్ధిలో రాణించాలి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: చుంచుపల్లి మండలం విద్యానగర్ లోని ఆంజనేయుడి విగ్రహం ఎదురుగా గల కొత్తగా ఏర్పాటుచేసిన "హోటల్ స్పందన" భోజన టిఫిన్ సెంటర్ వ్యాపార సంస్థను బుధవారం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం అభివృద్ధి యావత్తు ఇటువైపే జరుగుతున్నదని అటువంటి ఈ ప్రాంతంలో సరైన భోజన టిఫిన్ హోటల్లు లేకపోవడం ఎంతో శోచనీయమని ఈ నూతన హోటల్ స్పందన ఆ లోటును తీరుస్తుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. అన్ని రకాల టిఫిన్లను చక్కని భోజనాన్ని రుచికరంగా అందిస్తూ రేట్లలో కూడా కస్టమర్లకు అందుబాటులో ఉంటే తప్పకుండా హోటల్ అందరికీ అభిమాన పాత్రంగా అగ్రగామిగా నిలుస్తుందని బ్రదర్ జాన్ నరసయ్య దంపతులకు సిస్టర్ స్పందన దంపతులకు తమ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన హోటల్ స్పందన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం పాల్వంచల కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సర్పంచ్ శాంతి శ్రీ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంతోటి పాల్, సర్కిల్ ఇన్స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, చుంచుపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవి, పాస్టరేట్ చైర్మన్ బ్రదర్ రెవరెండ్ అభిజిత్, పాస్టరేట్ సెక్రటరీ బ్రదర్ వినయ్ కుమార్, గ్రూప్ చైర్మన్ బొమ్మిడి మల్లికార్జున్(ఐజక్), అంతోటి రాజు, మద్దాల మహేష్, అల్లి ప్రకాష్ , మార పాక కృష్ణస్వామి, సిహెచ్ జాన్ రత్నం, అనిల్, విజయ్, కడలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో అర్హులందరికీ పట్టాల పంపిణీ

- ఆరు ప్రత్యేక బృందాలతో సర్వే ప్రారంభమైంది
- అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పట్టాలు అందిస్తాం
- కొత్తగూడెంలో రూ.1.99కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించాం
- నగర ప్రజలకు సకల సౌకర్యాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు




**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: పట్టణ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జీవో 76 పట్టాల మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతోందని రెండు నెలల్లోనే అర్హులైన లబ్ధిదారులందరికీ అందజేస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం నగర పరిధిలోని 12, 14, 25, 49 డివిజన్లలో రూ.169 లక్షల వ్యంతో నిర్మించనున్న రోడ్లు డ్రైన్లు బతుకమ్మ ఘాట్ తదితర అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే 29వ డివిజన్లో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. మూడో విడతలో భాగంగా జీవో 76 కింద పట్టణంలో 2,241 దరఖాస్తులు అందాయని అందులో 1,420 దరఖాస్తుల విచారణ ఇప్పటికే పూర్తయిందని వెల్లడించారు. వీటిలో 150 పట్టాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. మిగిలిన 821 దరఖాస్తుల పరిశీలన కోసం ఆరుగురు తహసీల్దార్ల నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సర్వే ప్రారంభించాయని చెప్పారు. రాబోయే రెండు నెలల వ్యవధిలోనే పూర్తి స్థాయి విచారణ ముగించి ప్రతి దరఖాస్తుదారుడికీ పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేదని ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి డివిజన్ల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. శంకుస్థాపనలు పూర్తయిన అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, కమిషనర్ సుజాత, తహసీల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్లు సుధాకర్ రాజు, బోయిన విజయ్ కుమార్, మంద నాగలక్ష్మి, వై. శంకర్, స్థానిక నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గోపి కృష్ణ, గుత్తుల శ్రీనివాస్, యూసుఫ్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, భవాని ప్రసాద్, సాంబి రెడ్డి, వాడె రాములు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక రవాణాలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి: కలెక్టర్




**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: జిల్లాలో ఇసుక రవాణా కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఇసుక రవాణా వాహనాల నియంత్రణ ట్రాఫిక్ నిర్వహణ పార్కింగ్ ప్రాంతాలు అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇసుక వాహనాల రాకపోకలు అధికంగా ఉన్న మణుగూరు, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు ప్రాంతాల్లో రోడ్ల సామర్థ్యం ప్రస్తుత ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాహనాల ఎంట్రీ ఎగ్జిట్‌లను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో లారీలు రోడ్లపైకి రాకుండా అవసరానికి అనుగుణంగా దశలవారీగా వాహనాలను పంపించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. మణుగూరు, రామాంజవరం ప్రాంతాల్లో అవసరమైన హోల్డింగ్, పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వినియోగంలోకి తీసుకురావాలని చర్ల నుంచి భద్రాచలం మార్గంలో భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం రహదారి మరమ్మతుల నాణ్యతపై తక్షణమే పరిశీలన చేసి నివేదిక అందించాలని సూచించారు. బూర్గంపాడు పరిధిలో గొల్లగూడెం, సారపాక బ్రిడ్జి, తాళ్లగూడెం, ఉప్పాక, పినపాక పట్టినగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక రవాణా వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించి ప్రత్యామ్నాయ పార్కింగ్, హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ఇసుక రవాణా పెరిగే ప్రాంతాల్లో అవసరానికి అనుగుణంగా ట్రాఫిక్ మార్షల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. మణుగూరు, చర్ల ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా టీజీఎండీసీ అధికారులతో సమన్వయం చేసుకొని వాహనాల సాఫీ రాకపోకలకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఒకేసారి అదనంగా వాహనాలు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే విధంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలోకి అక్రమంగా ఇసుక రవాణా జరిగే అవకాశాలను నిరోధించేందుకు సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. సీజ్ చేసిన ఇసుకను అక్కడే నిల్వ ఉంచకుండా తదుపరి చర్యల కోసం తరలించేలా ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలు, జేసీబీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఇసుక రవాణా ట్రాఫిక్ నిర్వహణ అక్రమ ఇసుక రవాణా నియంత్రణలో పోలీసు రెవెన్యూ టీజీఎండీసీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ సూచించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగకుండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్ఓ పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి మైన్స్ దినేష్, జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, తాసిల్దారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికులకు జీవో 6 అమలు చేయాలి..

**పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని..**
**: టీయూసీఐ డిమాండ్**

**మణుగూరు, మహా :** గ్రామపంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 6ను వర్తింపజేసి నెలకు రూ.14 వేల వేతనం చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కూడా కల్పించాలని కోరారు. బుధవారం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మణుగూరు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 6 ద్వారా కార్పొరేషన్ పరిధిలో అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.16 వేలు, మున్సిపాలిటీ పరిధిలో రూ.15 వేలు, గ్రామీణ ప్రాంత కార్మికులకు రూ.14 వేల వేతనం నిర్ణయించిందన్నారు. ఈ జీవోను గ్రామపంచాయతీ కార్మికులకు కూడా అమలు చేయాలని కోరారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు కుటుంబ పోషణలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మణుగూరు మండల నాయకుడు డి. వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహార లోపాన్ని నివారించాలి

**సత్తుపల్లి, అక్టోబరు 7: మహా :** మహిళలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ సూచించారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి కుటుంబంలోనూ అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పెనుబల్లి మండలం వియం బంజర్‌లోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన పోషణ మాసం-2026 కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో సమీకృత శిశు అభివృద్ధి సేవలు, అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు. పోషకాహార ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, మండల నాయకులు, మహిళా నాయకులు, మహిళా సర్పంచులు, సమీకృత శిశు అభివృద్ధి సేవల సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీనిధులనుగణనీయంగాపెంచడంతో

- ప్రజా సౌకర్యాల కొరతను తీర్చవచ్చు...
- ప్రజాధనాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు..
- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి.



**రాజేంద్రనగర్ మహా** : చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి గ్రామాల సమగ్రాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ఎప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్, నానాజీపూర్, రామాంజపూర్ గ్రామాలలో ఎంపీ ల్యాడ్స్ సుమారు 40 లక్షల నిధులతో వివిధ గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, అభివృద్ధి పనులను గ్రామాల సర్పంచ్లు, వార్డు సభ్యుల, నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే తన ఎంపీ నిధుల నుంచి రూ 10 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఆ మాటకు కట్టుబడి ఈరోజు మూడు గ్రామాల్లో 40 లక్షల అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఎంపీ ల్యాడ్స్ కింద సంవత్సరానికి 5 కోట్లు కేటాయిస్తే అ నిధులు అక్కడి విస్తృత అభివృద్ధి అవసరాలకు, మౌలిక వసతుల కల్పనకు ఏమాత్రం సరిపోవని స్పష్టం చేశారు. ఎంపీ నిధులను గణనీయంగా పెంచడం ద్వారా నియోజకవర్గాల్లోని ప్రజా సౌకర్యాల కొరతను తీర్చవచ్చని, ప్రజాధనాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నిధులను 20 కోట్లకు పెంచడం, అలాగే కేంద్ర సంక్షేమ పథకాల నిధుల్లో 25% వాటాను ఎంపీలకు కేటాయించడం ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడతాయి ఎంపీల బాధ్యత పెరుగుతుందన్నారు.



# శంషాబాద్ మండలంలో పలు పాఠశాలలను...

- జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తనిఖీలు....

**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం శంషాబాద్ మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి శంషాబాద్‌లోని జడ్పీహెచ్ఎస్ (బాలుర) పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎక్స్టర్నల్ మౌల్యాంకనం సెంటర్‌ను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఈ విద్యాసంవత్సరం నుండి నూతనంగా 6వ తరగతి, 9వ తరగతి విద్యార్థుల ఎస్ ఏ 1, ఎస్ ఏ 2 పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఎక్స్టర్నల్ పద్ధతిలో నిర్వహించాలనే సంగతి తెలిసిందే. పైలెట్ ప్రాజెక్ట్ క్రింద శంషాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ఆరు , తొమ్మిదవ తరగతి విద్యార్థుల సమ్మేటివ్ 1 జవాబు పత్రాలు మూల్యాంకనం గత 4 రోజుల నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు శంషాబాద్ పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి , మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఎవాల్యూషన్ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మౌల్యాంకనం వేగవంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని సంబంధిత ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పలు సూచనలు చేశారు. అనంతరం, ఎంపిపిఎస్ రాళ్ళగూడ, ఎంపిపిఎస్ సాతంరాయి పాఠశాలను సందర్శించి, తరగతి గదులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగు సమస్యలపై శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలన

**రాజేంద్రనగర్ మహా :** అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్తల బృందం బుధవారం దత్తత గ్రామమైన కాచారం రాయన్నగూడ గ్రామాల్లో వివిధ పంటల సమస్యలను

గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో వెళ్లి సందర్శించారు. ఈ బృందంలో డా శ్రీధర్ సిద్ధి, సీనియర్ శాస్త్రవేత్త (వరి), డాలక్ష్మీ ప్రసన్న, ప్లాంట్ బ్రీడింగ్ సైంటిస్ట్, డా అరుణశ్రీ, కీటక శాస్త్రవేత్త , డా యూ స్రవంతి, ఉద్యాన శాస్త్రవేత్త శంషాబాద్ మండలం వ్యవసాయాధికారిని శ్వేత తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి గులాబీ, చామంతి, బెండ, మిరప, టమాటో తదితర పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. వరి పంటలో కంకి నల్లి, పొటాష్ పోషక సంబంధిత సమస్యలు, గులాబీలో బ్లాక్ స్పాట్ , టమాటోలో తెగుళ్ల సమస్యలు, బెండలో ఆకు పురుగు సమస్యలను గుర్తించి, వాటి నివారణకు తగిన శాస్త్రీయ సూచనలు, సలహాలను అందించారు. వరి పంట ప్రస్తుతం పొట్ట దశ నుంచి ఈనిక దశలోకి వచ్చింది. చివరి డోసులో యూరియాతో పాటు పొటాష్‌ను తప్పకుండా చేసుకోవాలన్నారు. పంటలో కంకి నల్లి కనిపిస్తున్నందున, ఎకరానికి 200 మి.లీ. స్పైరోమెసిఫెన్ మందును 7-10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. గులాబీ, చామంతి మొగ్గ దశలో ఉన్నాయి, వాటికి సంబంధించినటువంటి సూక్ష్మ, స్థూల పోషకాల ఫర్టిగేషన్ షెడ్యూలు గురించి వివరించారు. టమాటలో తెగుళ్ల సమస్యకు సంబంధించిన యాజమాన్య పద్ధతులను తెలిపారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల ఉద్యాన వ్యవసాయ విస్తరణ అధికారులు కిషోర్ లక్ష్మణ్, శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.





## ఆర్టీసీ పరిరక్షణకు ఐక్య కూటమిని గెలిపించాలి..

- **బాణం, నక్షత్రం గుర్తులకు ఓటేయాలని..**
- **టీఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ కూటమి ప్రచారం**

**మణుగూరు, మహా** : ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధనతో పాటు సంస్థ పరిరక్షణ కోసం ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య కోరారు. బుధవారం మణుగూరు ఆర్టీసీ డిపో ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సుదీర్ఘ విరామం అనంతరం ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీఎంయూ, అశ్వత్థామరెడ్డి బలపరిచిన టీఎండబ్ల్యూఎఫ్, ఎస్‌డబ్ల్యూఎఫ్, ఐఎన్‌టీయూసీ కలిసి ఐక్య కూటమిగా పోటీ చేస్తున్నాయని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే సంఘాలకు కార్మికులు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్మికులపై పనిభారం పెరుగుతున్నప్పటికీ ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడం, పలు పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వంటి అంశాలపై ఐక్య కూటమి పోరాడుతుందని కనకయ్య పేర్కొన్నారు. ఐక్య కూటమిని దెబ్బతీసేందుకు కొన్ని సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై అడ్డదారుల్లో ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. సంఘాల గత చరిత్ర, కార్మిక సమస్యలపై వాటి పోరాటాలను పరిశీలించి ఉద్యోగులు ఓటు వేస్తారని అన్నారు. రాష్ట్రస్థాయిలో బాణం, రీజియన్ స్థాయిలో నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణాల రాంబాబు, సీఐటీయూ సీనియర్ నాయకుడు నెల్లూరి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు, సర్పంచ్ కుంజా శ్రావణ్, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకుడు కేవీ రామారావు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్ రావు, తాటి సుధాకర్, కూటమి నాయకులు రాములు నాయక్, ఎస్ఎన్ రెడ్డి, సీహెచ్ లింగయ్య, ఎస్ఆర్ బాబు, అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సంబరాలు

- **అంబరాన్నంటిన ఫ్రెషర్స్ డే సంబరాలు**
- **డ్యాన్సులు, ప్రదర్శనలతో ఆద్యంతం కోలాహలం**

**బెల్లంపల్లి**,:మహా: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం ఆనందోత్సాహాల మధ్య ఫ్రెషర్స్ డే పార్టీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఎటు చూసినా విద్యార్థుల జోష్ కనిపించింది. 202627 విద్యా సంవత్సరానికి గాను ఈ కార్యక్రమాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి అమ్మవారి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థుల సమక్షంలో కార్యక్రమం ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య జరిగింది... మెరిట్ విద్యార్థులకు మెడల్స్...ఈ సందర్భంగా 202526 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసి వివిధ గ్రూపులలో మెరిట్ సాధించిన విద్యార్థులను సత్కరించారు. వారు సాధించిన మార్కులు మరియు గ్రేడుల ఆధారంగా గోల్డ్ మెడల్ మరియు సిల్వర్ మెడల్‌లను అందజేశారు. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఈ సత్కారాన్ని అందుకోవడం పట్ల ఆయా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఇక్కడ డిగ్రీ పూర్తి చేసి పీజీ సీట్లు మరియు బీఈడీ సీట్లు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

**అలరించిన పాటలు, ఆకట్టుకున్న డ్యాన్సులు**

ఈ సందర్భంగా వివిధ సినిమా పాటలు మరియు జానపద గీతాలపై విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎంతో ఉత్సాహంతో విద్యార్థిని, విద్యార్థులు ఆయా పాటలకు డ్యాన్సులు చేశారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ఉద్దేశించి చక్కటి మాటలు మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోజు రోజుకు అభివృద్ధి చెందుతుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును బాగా నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## మీర్జంపేట సబ్‌స్టేషన్‌కు 'పవర్' పెరిగింది!

- **3 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏకు సామర్థ్యం పెంపు.. రైతులు, ప్రజలకు ఊరట!**

**పెద్దపల్లి మహా, కాల్వ శ్రీరాంపూర్**: మండలంలోని మీర్జంపేట గ్రామ పరిధిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెరిగింది. రైతులు, ప్రజల విజ్ఞప్తికి స్పందించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ఆదేశాలతో విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని 3 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏకు పెంచారు. మీర్జంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచాలని ఆ ప్రాంత రైతులు, ప్రజలు ఎమ్మెల్యే విజయ రమణారావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విద్యుత్ అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎస్ ఈ గంగాధర్, డి ఈ బ్రహ్మచారి, ఏ డి ఈ రవీందర్, ఏ ఈ ఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని 3 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏకు పెంచినట్లు అధికారులు తెలిపారు. సామర్థ్యం పెంపుతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గి, రైతులకు వ్యవసాయ పనులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావుకు, విద్యుత్ శాఖ అధికారులకు ఏ ఎం సి చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, మీర్జంపేట సర్పంచ్ శైలజ-సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజణవేన సదయ్య, కాంగ్రెస్ నాయకుడు సారయ్య గౌడ్ రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ప్రచారాలు: ఎమ్మెల్యే

- **మహిళల పట్ల గౌరవంతో ఆప్యాయంగా పలకరించా**
- **వక్రబుద్ధితో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు!**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**
- **బీఆర్ఎస్ తప్పుడు ప్రచారంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం..**



మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం అమలుతీరును పరిశీలించేందుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ నేతలు వక్రబుద్ధితో సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఖండించారు. తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం అక్టోబర్ 7 మహా: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుతీరును పరిశీలించేందుకు మంగళవారం బొంగులూరు చౌరస్తా నుంచి తుర్కయంజాల్ మాసబ్ చెరువు వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఖండించారు. బస్సులో విద్యార్థినులతో ఆప్యాయంగా పలకరిస్తూ మాట్లాడిన ఘటనను వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదని అన్నారు. కాలేజ్ జోన్‌గా ఉన్న ఇబ్రహీంపట్నం ప్రాంతంలో మహిళలు, విద్యార్థినులు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎక్కువగా వినియోగించుకుంటున్న తరుణంలో, పథకం అమలుతీరును స్వయంగా తెలుసుకునేందుకే బొంగులూరు ఓఆర్ఆర్ వద్ద ఆర్టీసీ బస్సులో ఎక్కి ప్రయాణించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తనను చూసిన విద్యార్థులు, విద్యార్థినులు వచ్చి మాట్లాడిన సమయంలో వారితో తన బిడ్డల్లా ఆప్యాయంగా ముచ్చటించానని వెల్లడించారు. బస్సు రింగు రోడ్డు మలుపు తిరుగుతున్న సమయంలో కదులుతున్న బస్సులో చిత్రీకరించిన దృశ్యాలను, బీఆర్ఎస్ నేతలు తమకు అనుకూలంగా వక్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేయించారని ఆరోపించారు. మహిళలు, ఆడబిడ్డలంటే తనకు అపారమైన గౌరవం ఉందని మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ విమర్శల పేరుతో ఇలాంటి ఘటనలను వక్రబుద్ధితో వక్రీకరించడం సరికాదని, బీఆర్ఎస్ నేతల వ్యవహార శైలిని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## కేజీబీవీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

- **వేధింపులు, బాల్య వివాహాలపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచన**
- **ఎస్ఐ గట్ల సుధాకర్**

**పెద్దపల్లి మహా :** కాల్వ శ్రీరాంపూర్: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులతో ఎస్ఐ గట్ల సుధాకర్ ప్రత్యేకంగా సమావేశమై సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సాంకేతికత వినియోగం విస్తృతంగా పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలని ఎస్ఐ సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఎలాంటి వేధింపులు, బెదిరింపులు లేదా అసభ్య ప్రవర్తనకు గురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ పేర్కొన్నారు. సమస్యలను దాచిపెట్టడం వల్ల మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ధైర్యంగా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన రక్షణ కల్పిస్తామని తెలిపారు. బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే పోక్సో చట్టం ద్వారా బాలలకు కల్పిస్తున్న రక్షణ, చట్టపరమైన హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పండుగల సమయంలో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్ఐ గట్ల సుధాకర్ కోరారు. విద్యార్థులు పోలీసుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సీకేఎం లెక్చరర్ సతీష్ కుమార్ కు స్థానచలనం

**ఆరోపణల నేపథ్యంలో డిప్యూటేషన్ భద్రాచలం కు బదిలీ**

వరంగల్, మహా; సికేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజి లెక్చరర్, ఎన్సిసి కెప్టెన్ సతీష్ కుమార్ పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల కొంతమంది విద్యార్థినులు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కు ఫిర్యాదు చేశారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందించి ఐదుగురు జిల్లా అధికారులతో కమిటీ వేసి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఉద్యోగరీత్యా సతీష్ కుమార్ భద్రాచలం నుండి డిప్యూటేషన్ పై సికేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వచ్చారు. కాగా విచారణలో భాగంగా బుధవారం ఆరోపణలు ఎదుర్కొంటున్న సతీష్‌ను ప్రస్తుతం వరంగల్ నుంచి భద్రాచలం కు యదా స్థానానికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




## ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

- **సంబరాల్లో చైర్మన్ వి. నరేందర్ రెడ్డి సందడి!**

**వరంగల్, బ్యూరో మహా**: వరంగల్ ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో చైర్మన్ వి. నరేందర్ రెడ్డి పాల్గొని బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మ ఆటపాటలతో, గుమ్మడి పూల నడుమ బతుకమ్మ పండుగ శోభ సంతరించుకుంది. ఈ వేడుకల్లో ఆల్ఫోర్స్ చైర్మన్ వి.నరేందర్ రెడ్డి, జోనల్ ఇంచార్జ్ లింగమూర్తి, ప్రిన్సిపాల్ స్వప్న రెడ్డి, మహిళా అధ్యాపకుల తోపాటు విద్యార్థినిలతో కలిసి బతుకమ్మ పాటలకు నృత్యం చేసి విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతూ, వారిలో ఉత్సాహం నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అత్యంత ఘనంగా నిర్వహించారు. వరంగల్, హనుమకొండ, వర్ధన్నపేట, ఆల్ఫోర్స్ క్యాంపస్ లు మొత్తం బతుకమ్మ పూలతో, రంగురంగుల ముగ్గులతో కళకళలాడింది. వందలాది మంది విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలతో ఆటపాటలు సాగించారు. ఈ సందర్భంగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ కేవలం పండుగ మాత్రమే కాదు, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ఆడపిల్లల్లో మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంచడంతో పాటు, చదువులోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పరీక్షల వేళ విద్యార్థినులు బతుకమ్మ వేడుకల్లో వారి ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని ఇదే స్ఫూర్తితో 2027 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించాలని చైర్మన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి దీటుగా.. మంచిర్యాల జిల్లాలో వాట్సాప్ సామ్రాజ్యం..!?

- **వివాదాస్పద పోస్టులు, ఆపై గ్రూప్‌నకు లాక్‌లు.. నియంతల మారిన వైనం**
- **పోలీసు శాఖ ఆంక్షలు బేఖాతరు.. కఠిన చర్యలు శూన్యం**
- **ఈ గుట్టంతా ఆ వేములవాడ రాజరాజేశ్వరుడికే ఎరుక**

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రధాన పారిశ్రామిక, రాజకీయ కేంద్రమైన మంచిర్యాలలో సోషల్ మీడియా వేదికగా సాగుతున్న అరాచకం తారాస్థాయికి చేరింది. ప్రభుత్వ అధికార యంత్రాంగానికి దీటుగా కొందరు అరాచక శక్తులు ఓ ప్రత్యేక వాట్సాప్ గ్రూపును సామ్రాజ్యంగా మలుచుకుని చక్రం తిప్పుతున్నారు. వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులను సైతం మాయమాటలు, ఒత్తిళ్లతో ఈ గ్రూప్‌లో సభ్యులుగా చేర్చుకుంటున్న నిర్వాహకులు, ఆ తర్వాత తమ పన్నాగాలకు తెరలేపుతున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**ఉద్యోగులు, వ్యాపారులే లక్ష్యంగా**

ఈ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు కొందరితో కుమ్మక్కై ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికారప్రతిపక్ష పార్టీల రాజకీయ నేతలు, సింగరేణి సంస్థ వివిధ ఏరియాల జీఎంలు, ట్రేడ్ యూనియన్ నాయకులను టార్గెట్ చేస్తూ వివాదాస్పద పోస్టులు సృష్టిస్తున్నారు. ఎవరినైనా బద్నామ్




చేయడమే లక్ష్యంగా కొంతరి గ్యాంగ్‌తో కావాలనే తప్పుడు కామెంట్లు పెట్టించి, సమాజంలో వారి పరువు ప్రతిష్టలను దిగజార్చేలా ప్రవర్తిస్తున్నారు.

**పోలీసులను వదలని వైనం.. నిబంధనలకు తూట్లు**

సామాన్యుల నుంచి ఉన్నతాధికారులు వరకు ఎవరినీ ఈ గ్రూప్ వదలడం లేదు. ఈ ప్రైవేట్ వాట్సాప్ సామ్రాజ్యంలో ఏకంగా పోలీస్ శాఖకు చెందిన సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు తదితర అధికారులను సైతం సభ్యులుగా ఉంచుకుని వారిని కీలుబొమ్మలుగా మారుస్తున్నారనే తీవ్ర విమర్శలున్నాయి. వాట్సాప్ గ్రూపులలో ఎటువంటి వివాదాస్పద, కించపరిచే పోస్టులు పెట్టరాదని స్వయంగా సీపీ, డీసీపీ, ఏసీపీ స్థాయి అధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ఈ గ్రూప్ నిర్వాహకులు ఆ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. పోలీసుల హెచ్చరికలను లెక్కచేయకుండా ఇలాంటి పనులు చేస్తుండటంతో జిల్లాలో పోలీసు శాఖ పట్టు కోల్పోయే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది.

**ఆ పోస్టుల మర్మం ఎవరికెరుక..?**

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, రాజకీయ నేతలు, కాంట్రాక్టర్లు ఎవరైనా చిన్నాచితక తప్పిదాలు చేస్తే చాలు.. ఆ పోస్టులను గ్రూపులో పెట్టి బజారుకీర్చడం ఈ గ్రూప్‌నకు షరా మామూలుగా మారిందని జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

**కొద్ది రోజుల క్రితం జిల్లాకు చెందిన ఒక సీఐ మాట్లాడిన ఆడియోను పోస్ట్ చేయడం,**

మహారాష్ట్రలో మంచిర్యాలకు చెందిన ఒక ప్రముఖ పత్రిక స్టాఫ్ రిపోర్టర్ పత్తాలాట క్లబ్బుకు వెళ్ళి దెబ్బలు తిన్నాడంటూ ప్రచారం చేయడం, మరో నేతను రాజకీయ కక్షతో సింగరేణి గృహం నుండి మంత్రి నెట్టి వేయించారంటూ పోస్టులు పెట్టి అందరినీ రెచ్చగొట్టడం.

ఇలా ప్రజలను అయోమయానికి గురిచేసి చివరికి ఏం సాధిస్తున్నారో ఈ గుట్టంతా ఆ వేములవాడ రాజరాజేశ్వరుడికే ఎరుకని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**పోస్టుల హోరు.. ఆపై గ్రూప్‌నకు లాక్.!**

ఈ ముఠా సభ్యుల మరో విచిత్ర తతంగం ఏమిటంటే.. గ్రూప్‌లో ఎవరిపైనో ఒకరిపై బురదజల్లుతూ అత్యంత వివాదాస్పదమైన పోస్టులు పంపడం, ఆ వెంటనే తమకు వ్యతిరేకంగా ఎవరూ స్పందించకుండా గ్రూప్‌నకు లాక్ వేయడం పరిపాటిగా మార్చుకుంటున్నారు. తాము మాత్రం ఇష్టానుసారంగా ఆరోపణలు గుప్పిస్తూ, అవతలి వారికి కనీసం వివరణ ఇచ్చుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా, నియంతలా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి సోషల్ మీడియా బ్లాక్ మెయిలర్లు, అనధికార గ్రూప్‌ల సామ్రాజ్యాలపై జిల్లా ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాల ప్రజలు, బాధితులు కోరుతున్నారు



## రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

**మొయినాబాద్ మహా:** లారీ బీభత్సానికి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందిన విషాద ఘటన చేవెళ్ల మండలం గొల్లపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మధు (36), భార్య సావిత్రి (30), కుమారుడు ధనుష్ (6), తొమ్మిదేళ్ల కుమార్తెతో కలిసి చేవెళ్ల మండలం చన్వెల్లి గ్రామంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా గొల్లపల్లి సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్ను ఢీకొట్టింది. దీంతో మధు, సావిత్రి, ధనుష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాలికను చేవెళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## పొన్నెకంటి సంజీవరాజు జయకుమారికి సన్మానం

**మురిసిన కుటుంబ సభ్యులు**

**హాజరైన ప్రముఖులు.. సందడిగా సన్మానోత్సవం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షురాలు పొన్నెకంటి జయకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాచార కమిషనర్ దేశాల భూపాల్ హాజరై ప్రసంగించారు. అనంతరం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సురా స్రవంతి కలిసి పొన్నెకంటి జయకుమారి, పొన్నెకంటి సంజీవరాజులను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సరిగ్గా లేక వాహనదారులు నరకయాతన

- **కాటేదాన్ -గగన్ పహడ్ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారంచూపాలి...**
- **బిజెపి నాయకుల డిమాండ్**

**రాజేంద్రనగర్ మహా :** కాటేదాన్ గగన్ పహడ్ మెయిన్ రోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డును గుంతలమయంగా చేశారు. రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ వ్యవస్థను, డిస్మెంటల్ చేసి రోడ్డుపైనే వదిలేశారు.కాటేదాన్ గగన్ పహడ్ రోడ్డు పరిస్థితిని బిజెపి నాయకులు అడికే రాజు, బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. వాహనదారులు రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ప్రతి రోజు పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డును సరిచేసి ప్రమాదాల బారిన పడకుండా చూడాలని జిహెచ్ఎంసి అధికారులను కోరారు.






# కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలు భర్తీ చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**పెద్దపల్లి మహా** : తెలంగాణ ఉద్యమంలో ఆట, పాటలతో ప్రజలను చైతన్యపరిచిన నిరుద్యోగ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు తాండ్ర సదానందం మద్దతు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కళాకారులు ఈ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిరుద్యోగ కళాకారులు కీలక పాత్ర పోషించారని, తమ ఆట, పాటల ద్వారా ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కళాకారులు నిరాహార దీక్షలు చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళాకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వారి డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే సీపీఐ పార్టీ తరపున కళాకారుల పోరాటానికి అన్ని వేళలా అండగా ఉంటామని తాండ్ర సదానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సీపీఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు ఎం.డి. రజాక్, తుంగాని రాకేష్ (రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి), దబ్బేట పుష్పలత (రాష్ట్ర కల్చరల్ ఇన్‌చార్జి), కలవేని రాణి (రాష్ట్ర ఆర్గనైజర్), తెలంగాణ ఉద్యమ కళాకారులు కన్నూరి ఆంజనేయులు, గాజుల రమేష్, దుబాసి శ్రీనివాస్, పులిపాక బానిష్, నిట్టూరు సరూప, బట్టల గీత, పెండెం కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి ఆస్తిని కాపాడటంలో సెక్యూరిటీ, ఎంటీఎఫ్ సిబ్బంది సేవలు అభినందనీయం

**మోటార్ల చోరీని అడ్డుకున్న సిబ్బందికి సన్మానం**

**మందమర్రి, మహా :** సింగరేణి సాలరీస్ కంపెనీ సంస్థ ఆస్తులను పరిరక్షించడంలో ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ విభాగం, మొబైల్ ట్రాన్స్ పోర్ట్ ఫోర్స్ (ఎంటీఎఫ్) సిబ్బంది చూపుతున్న చొరవ అభినందనీయమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ కొనియాడారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ మంగళవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో మందమర్రి ఏరియాలోని మంజునాథ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సోలార్ ప్లాంట్ సమీపంలో విధుల్లో ఉన్న ఎంటీఎఫ్ సిబ్బందికి అనుమానాస్పదంగా ఒక వ్యాన్ కనిపించిందని వెల్లడించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సింగరేణి సంస్థకు చెందిన రెండు ఖరీదైన కరెంట్ మోటార్లను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఆ మోటార్లను, వ్యాన్ ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని సెక్యూరిటీ ఆఫీసులో అప్పగించినట్లు జిఎం వెల్లడించారు. సకాలంలో స్పందించి సింగరేణి సొత్తును కాపాడిన సెక్యూరిటీ సిబ్బందిని జీఎం ప్రత్యేకంగా అభినందించారు. వారి నిబద్ధతను మెచ్చుకుంటూ శాలువాతో సన్మానించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి చోరీలను అరికట్టినప్పుడే సంస్థ లాభాల బాటలో పయనిస్తుందని, సంస్థ పురోగతి సాధిస్తేనే కార్మికుల సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్తులో కూడా సెక్యూరిటీ విభాగం ఇలాగే అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్.ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సీహెచ్.అశోక్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ షాపు కేటాయింపులో అక్రమాలు!?

- ప్రజాస్వామ్యాన్ని, స్థానిక నేతలును అవమానించడమే
- కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్

**పెద్దపల్లి మహా,** రామగుండం :మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌కు సంబంధించిన 3612058 రేషన్ షాపును,స్థానికులకు కాకుండా వేరే ప్రాంతం వారికి కేటాయించడంపై1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ తీవ్ర అభ్యంతరం మరియు నిరసన వ్యక్తం చేశారు.స్థానిక ప్రజాప్రతినిధికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా,కనీసం సంప్రదించకుండా అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం పట్ల మండిపడ్డారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారి ప్రజా పాలనలో 1వ డివిజన్ ప్రజల సంక్షేమం,హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నాం ఉంటే డివిజన్ పరిధిలోని రేషన్ కార్డుదారులకు సరుకులు సక్రమంగా, సమయానికి అందాలంటే ఆ రేషన్ షాపు నిర్వహణ స్థానికుల చేతిలోనే ఉండాడం చేత .అలాకాకుండా డివిజనేతరులకు ఈ షాపును కట్టబెట్టడం వల్ల భవిష్యత్తులో స్థానిక ప్రజలు నిత్యావసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆరోపణలు ఉన్నవి అని ఈ షాప్ లు ఏ పద్ధతిలో కేటాయించారో సహా చట్టం ద్వారా సమాచారం తెలుసుకుంటామని విజయ మల్లేష్ అన్నారు.

**ఏకపక్ష కేటాయింపును వెంటనే రద్దు చేయాలి**

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కార్పొరేటర్‌కు తెలియకుండా చేసిన ఈ రేషన్ షాపు కేటాయింపును అధికారులు తక్షణమే రద్దు చేయాలి అని 1వ డివిజన్ పరిధిలోని అర్హులైన నిరుద్యోగులు లేదా స్థానిక లబ్ధిదారులకు మాత్రమే రేషన్ షాపు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని తెలిపారు.స్థానిక నేతల ప్రమేయం లేకుండా, రహస్యంగా ఎవరి స్వప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారో అధికారులు బహిరంగంగా సమాధానం చెప్పాలి అంటూ .స్థానిక ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టేలా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ హెచ్చరించారు

## జిల్లా డీఎంహెచ్ఓగా డాక్టర్ కె. కళ్యాణ్ చక్రవర్తి బాధ్యతలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా (డీఎంహెచ్ఓ) డాక్టర్ కె. కళ్యాణ్ చక్రవర్తి నియమితులయ్యారు. ప్రస్తుతం జిల్లా క్షయ నివారణాధికారిగా (డీటీసీఓ) విధులు నిర్వహిస్తున్న ఆయనకు, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు డీఎంహెచ్ఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత మూడు రోజుల క్రితం లంచం తీసుకుంటూ పట్టుబడిన డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి స్థానంలో, రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వెంటనే డీఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును ఆయన పర్యవేక్షించనున్నారు.

# నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి

- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా




**మంచిర్యాల,మహా** : జిల్లాలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్ తో కలిసి ఏఈఆర్వోలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఐఆర్2026లో భాగంగా జిల్లాలో మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన నోటీసులను పూర్తిగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 3 ఈఆర్వోలు, 18 ఏఈఆర్వోలు, అదనంగా కేటాయించబడిన 18 ఏఈఆర్వోలు క్లెయిమ్స్ & అబ్జెక్షన్ ప్రక్రియపై పని చేస్తున్నారని చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు 18 ఏళ్లు నిండి ఓటు హక్కుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని, నోటీసులు జారీ అయిన ప్రతి ఒక్కరూ సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన 11 డాక్యుమెంట్లలో నుండే ఓటర్లు పత్రాలు సమర్పించేలా చూడాలన్నారు. ఫారం 7 ద్వారా అందిన దరఖాస్తులను మరణ ధ్రువీకరణ పత్రం పరిశీలన, కుటుంబ సభ్యుల ఆమోదం ద్వారా తొలగించాలని, అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం మేరకు కుల ధ్రువీకరణ పత్రాలను నిబంధనల మేరకు జారీ చేయాలని సూచించారు. అనంతరం ఏఈఆర్వోలు, అదనపు ఏఈఆర్వోలతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి బూత్ స్థాయి అధికారులు ఫారం 7 దరఖాస్తుల పరిశీలన విషయంలో రిజిస్టర్ నిర్వహించి పూర్తి వివరాలు నమోదు చేయాలని, బీఎల్ఏలకు అవసరమైన సమాచారాన్ని బీఎల్ఓల ద్వారా అందించాలని, తరచూ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న యోగితా రాణా అదనపు కలెక్టర్ వి.రాములుతో కలిసి జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 111, 112 పోలింగ్ కేంద్రాలను సందర్శించి బీఎల్ఓల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

- పోలీసుల స్పెషల్ డ్రైవ్..
- వాహనాల విస్తృత తనిఖీలు




**పెద్దపల్లి మహా** : రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, వాహనదారుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో పెద్దపల్లి జిల్లా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తదితర ధ్రువపత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించారా? కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ వినియోగిస్తున్నారా? అనే అంశాలపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోసులు ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేశారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అదేవిధంగా మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, రాంగ్ రూట్ లో ప్రయాణించడం, సిగ్నల్ జంపింగ్, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వంటి నిబంధనల ఉల్లంఘనలపై కూడా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రజల సహకారం అవసరం**

ట్రాఫిక్ నిబంధనలు కేవలం జరిమానాల భయంతో కాకుండా ప్రతి ఒక్కరి భద్రత కోసం పాటించాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతగా వ్యవహరించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

## ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి మహా :** జిల్లాలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో రెండు రోజులపాటు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిబిరం తొలిరోజు బుధవారం విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకులు శిబిరానికి హాజరై ఆధార్ నమోదు సేవలను వినియోగించుకున్నారు. 5 సంవత్సరాల లోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం అక్టోబర్ 8న కూడా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. రామగుండం పరిధిలోని అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లల ఆధార్ నమోదు చేయించాలని సూచించారు. చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా మరియు ఇతర అవసరాలకు ఆధార్ ఆధారిత సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కావున 5 సంవత్సరాల లోపు చిన్నారుల తల్లిదండ్రులు అక్టోబర్ 8న రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరానికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ఎంపీల అరెస్టు అప్రజాస్వామికం

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, అక్టోబర్ 7**: ఓటరు జాబితాల సవరణ పేరుతో దేశంలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే పరిస్థితులు నెలకొంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. ఓటర్ల హక్కులపై ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కేసి వేణుగోపాల్ తో పాటు ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆయన తీవ్రంగా ఖండించారు.బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ "ఓటు అనేది కేవలం ఒక గుర్తు కాదు.. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఆయుధం. ఆ ఓటు హక్కుకు సంబంధించిన అనుమానాలు, సందేహాలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రశ్నించిన నాయకులను అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదు" అని రాజేందర్ రావు అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉండాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాలని ఆయన అన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమగ్రంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "దేశ ప్రజాస్వామ్యానికి ఎన్నికల సంఘం ఒక కాపలాదారు. కానీ అదే వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే పరిస్థితి రావడం ఆందోళనకరం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీజేపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారనీ ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఆయన ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ సిఈసి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోరాటం చేయడం లేదని రాజేందర్ రావు అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, ఆ హక్కును అణచివేసేందుకు అరెస్టులు, నిర్బంధాలను ఉపయోగించడం సరైన విధానం కాదని రాజేందర్ రావు అన్నారు. "రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడం ద్వారా వారి గొంతును అణచివేయలేరు. దేశ ప్రజల గొంతుకను కూడా అణచివేయ లేరని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును ఎవరూ కాలరాయలేరు" అని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని రాజేందర్ రావు డిమాండ్ చేశారు. ఓటరు జాబితాల సవరణ నుంచి ఎన్నికల ఫలితాల వరకు ప్రతి దశలోనూ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. "దేశంలో ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ఓటు హక్కు బలంగా ఉండాలి. ఓటు హక్కు బలంగా ఉండాలంటే ఓటరు జాబితాలు పారదర్శకంగా ఉండాలి. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలి. ఈ మూడు అంశాల్లో ఎక్కడైనా అనుమానం తలెత్తితే ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతుంది. అందుకే ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుంది" అని వెలిచాల రాజేందర్ రావు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల తరపున నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## బెత్తంతో వాతలు వచ్చేలా కొట్టిన టీచర్ సస్పెన్షన్

**వరంగల్, నెక్కొండ, మహా ;**

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం లోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు) లో 5వ తరగతి విద్యార్థుల పై రజిని ఇంగ్లీష్ టీచర్ అమానుషంగా బెత్తంతో కొట్టినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్త పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సుమోటోగా స్పందించారు.ఈ ఘటన పై ప్రాథమిక విచారణ చేపట్టేందుకు నెక్కొండ మండల పరిషత్ అధికారిని విచారణ అధికారిగా నియమించారు. విచారణ అధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయురాలును సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.
విద్యార్థులపై ఎలాంటి వేధింపులు, శారీరక దాడులకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

## వర్ధన్నపేట ఎమ్మెల్యే తీరు పై వరంగల్ జర్నలిస్టుల నిరసన!

**వర్ధన్నపేట** : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తీరును నిరసిస్తూ వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్ లో జర్నలిస్టుల భారీ ఆందోళన, నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు.
వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తీరు పై వరంగల్ జర్నలిస్టులు భగ్గుమన్నారు. మీడియా సంస్థ దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా పోచమ్మ మైదాన్ కూడలిలో జర్నలిస్టులు రోడ్డుపై బైఠాయించి నల్ల బ్యాడ్జీలతో భారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు పరపతి సంఘం అధ్యక్షులు నరేందర్ మాట్లాడుతూ.. ప్రశ్నించే నాలుగో స్తంభంపై ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యానికి దిగడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికి నాలుగు సార్లు జరిగాయని, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు తీరు పై వరంగల్ జర్నలిస్టులు భగ్గుమన్నారు. మీడియా సంస్థ దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా పోచమ్మ మైదాన్ కూడలిలో జర్నలిస్టులు రోడ్డుపై బైఠాయించి నల్ల బ్యాడ్జీలతో భారీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు పరపతి సంఘం అధ్యక్షులు నరేందర్ మాట్లాడుతూ.. ప్రశ్నించే నాలుగో స్తంభంపై ఎమ్మెల్యే అనుచరులు దౌర్జన్యానికి దిగడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికి నాలుగు సార్లు జరిగాయని, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వార్తల పై ఏవైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాలు ఉన్నాయి తప్ప, ఇలా దిష్టిబొమ్మలు తగలబెట్టడం ప్రజాస్వామ్య సంప్రదాయం కాదని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, ఎమ్మెల్యే క్షమాపణ చెప్పే వరకు తమ నిరసనలు ఆపబోమని ఆందోళనకారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు జర్నలిస్టులు కొరుకుప్పల నరేందర్, పెరుమాండ్ల మధుసూదన్, బండి రవి, మిట్టపల్లి నవనీత్, మహమ్మద్ అమీర్, చిన్నబాబు,ఈద శ్రీనాథ్, నీలం శివ, గంగరాజు, వంశీ , వెలుగందుల అజయ్ కుమార్, రాజు, భాగ్యరాజు, ప్రకాష్ , ప్రశాంత్, కృష్ణ, నరేష్, బేతి ఉమా శంకర్, కలికోట శ్రీధర్, యుగేందర్, జన్ను శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**సిద్దిపేట జిల్లా ఐనాపూర్ వాసిగా గుర్తింపు**



కుషాయిగూడ, మహా : కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కీసర మండలం బండ్లగూడ రామలింగేశ్వర కాలనీకి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు. మాజీ సర్పంచ్ పి. విజయేందర్ కుమారుడు పి. మురళి కార్తీక్ (23) ఈ నెల 6న రాత్రి సుమారు 11.30 గంటలకు చక్రిపురం నుంచి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కుషాయిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదురుగా వాహనం అదుపుతప్పి జారిపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఈ నెల 7న ఉదయం 5.30 గంటలకు వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి విజయేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బండ్లగూడ రామలింగేశ్వర కాలనీలో విషాదఛాయలు అల్లుకున్నాయి.

# బ్లాక్ కేప్ లుక్‌లో సమంత సందడి

**గ్లామర్‌కు క్లాసీ టచ్.. అభిమానులను ఆకట్టుకుంటున్న తాజా ఫొటోలు**

సినీ నటి సమంత రూత్ ప్రభు మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఇటీవల ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. పూర్తిగా నలుపు రంగు దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని తనవైపు తిప్పుకున్నారు. సమంత ధరించిన కేప్ తరహా టాప్, మెరిసే సీక్విన్ స్కర్ట్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పొడవైన వేవీ హెయిర్‌తో పాటు సింపుల్ కానీ ఎలిగెంట్ మేకప్‌తో సమంత కనిపించారు. చెవులకు ధరించిన ఆభరణాలు, చేతికి ఉన్న రింగ్స్ కూడా ఆమె ఫ్యాషన్ స్టైల్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కేప్ డిజైన్ ఉన్న టాప్ కారణంగా ఈ లుక్‌కు డిఫరెంట్ అప్పీల్ వచ్చింది. ఫ్యాషన్ విషయంలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపించే సమంత.. ఈసారి కూడా తన ప్రత్యేక శైలిని ప్రదర్శించారు. సోనీ విజ్డా లాంచ్ కార్యక్రమంలో సమంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకు ఈ కార్యక్రమంలో భాగమవడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతి అని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. ఈ లుక్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఫొటోల్లో సమంత ఇచ్చిన పోజులు, ఆమె స్టైలింగ్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.ఇక సినిమాల విషయానికి వస్తే.. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సమంత, విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల ఆమె సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టెలివిజన్ కార్యక్రమాలతో ప్రేక్షకులకు మరింత చేరువవుతున్నారు. సమంత తాజా బ్లాక్ లుక్ విషయానికి వస్తే.. సంప్రదాయ గ్లామర్‌కు భిన్నంగా క్లాసీ, మోడ్రన్ స్టైల్‌ను మేళవించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె అభిమానులు ఈ ఫొటోలను సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు.



# ఫ్యాన్స్‌కు శివకార్తికేయన్ మంచి సలహా

**సోషల్ మీడియా నెగెటివిటీకి దూరంగా ఉండాలంటే పుస్తక పఠనం**

**చెన్నై, మహా:** సాధారణంగా సినీ తారలు అభిమానుల సమావేశాల్లో సినిమాలు, కొత్త ప్రాజెక్టులు, విజయాల గురించి మాట్లాడుతుంటారు. అయితే తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్ మాత్రం తన అభిమానులకు ఇచ్చిన ఓ సలహా ఇప్పుడు ప్రత్యేకంగా చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పెరుగుతున్న నెగెటివిటీ, ట్రోలింగ్, అనవసరమైన డిస్ట్రాక్షన్స్‌కు దూరంగా ఉండేందుకు పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని ఆయన సూచించారు. రోజులో కనీసం పది నిమిషాలైనా పుస్తకం చదవడానికి కేటాయించాలని అభిమానులను కోరారు. గత ఏడాది కాలంగా తాను క్రమం తప్పకుండా పుస్తకాలు చదువుతున్నానని శివకార్తికేయన్ తెలిపారు. సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడపడం వల్ల మన దృష్టి అనవసరమైన విషయాలపైకి మళ్లే అవకాశం ఉందని, అదే సమయంలో ప్రతికూల వ్యాఖ్యలు, ట్రోలింగ్ వంటి అంశాలు మనసుపై ప్రభావం చూపుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల నుంచి కొంత దూరంగా ఉండేందుకు పుస్తక పఠనం తనకు ఉపయోగపడుతోందని చెప్పారు. పుస్తకాలు చదవడం వల్ల మనసుకు ప్రశాంతతతో పాటు మంచి అనుభూతి కలుగుతుందని శివకార్తికేయన్ పేర్కొన్నారు. ఏదైనా మంచి అలవాటు తన జీవితంలో సానుకూల మార్పును తీసుకొస్తే.. అదే అనుభూతి తన అభిమానులకు కూడా కలగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అందుకే తమకు ఆసక్తి ఉన్న ఏ అంశానికి సంబంధించిన పుస్తకమైనా ఎంచుకుని ప్రతిరోజూ కొద్దిసేపు చదవాలని సూచించారు. ప్రస్తుతం యువతలో సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. రీల్స్, షార్ట్ వీడియోలు, ట్రెండింగ్ పోస్టులు, కామెంట్లు చూస్తూ గంటల సమయం తెలియకుండానే గడిచిపోతోంది.



మరోవైపు సెలబ్రిటీలపై వచ్చే ట్రోల్స్, వివాదాస్పద పోస్టులు, ప్రతికూల ప్రచారం కూడా సోషల్ మీడియా వాతావరణాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో శివకార్తికేయన్ ఇచ్చిన పుస్తక పఠన సలహా ప్రాధాన్యం సంతరించుకుంది. సినిమా రంగంలో ఎలాంటి నేపథ్యం లేకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శివకార్తికేయన్.. అభిమానులతో తరచూ సన్నిహితంగా మెలుగుతుంటారు. ఇటీవల జరిగిన అభిమానుల కార్యక్రమాల్లోనూ ఆయన వారితో పలు విషయాలను పంచుకున్నారు. తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను కూడా అభిమానులతో పంచుకున్న ఆయన.. తన ఎదుగుదలలో అభిమానుల మద్దతు కీలకమని పలుమార్లు చెబుతున్నారు. ఇటీవల అభిమానుల సమావేశాల్లో శివకార్తికేయన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. అయితే పుస్తక పఠనంపై ఆయన చేసిన సూచన మాత్రం సినిమా విషయాలకు అతీతంగా ఉండటంతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. స్టార్ హీరోగా తన మాటలను అభిమానులు అనుసరించే అవకాశం ఉన్నందున.. మంచి అలవాట్లను ప్రోత్సహించే ప్రయత్నం ప్రశంసలు అందుకుంటోంది. రోజుకు పది నిమిషాల పుస్తక పఠనంతోనే మొదలు పెట్టి క్రమంగా ఆ సమయాన్ని పెంచుకోవచ్చని ఆయన సూచన సారాంశం. సోషల్ మీడియాను పూర్తిగా వదిలేయడం కంటే దాని వినియోగాన్ని నియంత్రించుకోవడం, మనకు ఉపయోగపడే విషయాలకు ఎక్కువ సమయం కేటాయించడం అవసరమనే సందేశాన్ని శివకార్తికేయన్ తన అభిమానులకు అందించారు.




# 18 ఏళ్ల తర్వాత మళ్లీ జోడీ

**'కొత్త బంగారు లోకం' జంటతో 'నా వైఫ్ మిస్సింగ్'**

హైదరాబాద్, మహా: టాలీవుడ్ ప్రేక్షకులకు 'కొత్త బంగారు లోకం' చిత్రంతో గుర్తుండిపోయిన వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జోడీ దాదాపు 18 ఏళ్ల తర్వాత మరోసారి కలిసి నటిస్తోంది. అయితే ఈసారి వెండితెరపై కాకుండా ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వీరిద్దరూ జంటగా నటించిన తాజా చిత్రం 'నా వైఫ్ మిస్సింగ్'. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ తాజాగా విడుదలై ఆసక్తిని పెంచుతోంది. పెళ్లిచూపులతో ప్రారంభమయ్యే టీజర్‌లో వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ పాత్రల మధ్య పరిచయం, పెళ్లి, ఆ తర్వాత జరిగే సంఘటనలను చూపించారు. మొదట్లో ఇద్దరి మధ్య బంధం సంతోషంగా సాగుతున్నట్లు కనిపించినప్పటికీ.. కొంతసేపటికే కథ అనూహ్యమైన మలుపు తీసుకుంటుంది. భార్య కనిపించకుండా పోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించడం కథలో కీలకమైన అంశంగా కనిపిస్తోంది. భార్య ఎక్కడికి వెళ్లింది? ఆమె అదృశ్యం వెనుక అసలు కారణం ఏమిటి? ఈ వ్యవహారంలో భర్త పాత్ర ఎంతవరకు ఉంది? అనే ప్రశ్నలను టీజర్ ప్రేక్షకుల్లో రేకెత్తిస్తోంది. కథ ముందుకు సాగే కొద్దీ మిస్టరీ మరింతగా పెరుగుతుందని తెలుస్తోంది. కుటుంబ నేపథ్యంతో మొదలైన కథ క్రమంగా క్రైమ్, సైకాలజికల్, ఎమోషనల్ అంశాల వైపు మళ్లినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రంలో వరుణ్ సందేశ్ బాలు అలియాస్ బాలసుబ్రహ్మణ్యం అనే గ్రామీణ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ పాత్రలో కనిపించనున్నారు. తన భార్య కనిపించడం లేదంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే భర్తగా ఆయన పాత్ర కథలో కీలకంగా మారనుంది. భార్య అదృశ్యం వెనుక ఉన్న నిజాన్ని తెలుసుకునే క్రమంలో ఎదురయ్యే పరిణామాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. చాలా సంవత్సరాల తర్వాత వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ కలిసి నటించడం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. 'కొత్త బంగారు లోకం'లో వీరి జోడీకి మంచి ఆదరణ లభించిన నేపథ్యంలో.. ఇప్పుడు పూర్తిగా భిన్నమైన క్రైమ్ థ్రిల్లర్‌లో ఇద్దరూ కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. స్వాతి ప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కొమర మీడియా వర్క్స్ బ్యానర్‌పై శివ కాంతనేని, ఆర్. వెంకటేశ్వరరావు నిర్మిస్తున్నారు. ప్రవీణ్, మోహిత్, జబర్దస్త్ సత్యశ్రీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. 'నా వైఫ్ మిస్సింగ్' చిత్రం అక్టోబర్ 22 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

# కార్తీక్ కథకు చిరంజీవి ఓకేనా?

**రెండున్నర గంటల నరేషన్..**
**మెగాస్టార్ నిర్ణయం పెండింగ్**

హైదరాబాద్, మహా: మెగాస్టార్ చిరంజీవి తదుపరి సినిమా విషయంలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఇటీవల చిరంజీవిని కలిసి ఓ కథను వివరించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన ఈ కథా నరేషన్‌లో దర్శకుడు పూర్తి కథను, పాత్రలను, కీలక సన్నివేశాలను వివరించినట్లు సమాచారం. అయితే నరేషన్ పూర్తయినప్పటికీ ఈ ప్రాజెక్ట్‌కు చిరంజీవి ఇంకా తుది అంగీకారం తెలపలేదని తెలుస్తోంది. విభిన్నమైన కథలు, ప్రత్యేకమైన టేకింగ్‌తో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కార్తీక్ సుబ్బరాజ్.. ఈసారి చిరంజీవి ఇమేజ్‌కు సరిపోయేలా ఓ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. సాధారణ కమర్షియల్ అంశాలతో పాటు తనదైన శైలిలో ఉండే కథనం, పాత్రల రూపకల్పన ఈ ప్రాజెక్ట్‌లో ఉండే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కార్తీక్ సుబ్బరాజ్ సినిమాల్లో డార్క్ హ్యూమర్, రా అండ్ రస్టిక్ ట్రీట్‌మెంట్, గ్యాంగ్‌స్టర్ నేపథ్యాలు, విభిన్నమైన పాత్రలు ప్రధానంగా కనిపిస్తుంటాయి. 'పేట' వంటి చిత్రాల్లో ఆయన స్టార్ హీరోలను కూడా తన ప్రత్యేక శైలిలో చూపించారు. ఈ నేపథ్యంలో చిరంజీవితో ఆయన సినిమా అంటే ఎలాంటి కథను ఎంచుకున్నారు? మెగాస్టార్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారు? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

అయితే చిరంజీవి సాధారణంగా తన అభిమానులను దృష్టిలో పెట్టుకుని కథలో బలమైన కమర్షియల్ అంశాలు, వినోదం, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. మరోవైపు కార్తీక్ సుబ్బరాజ్ టేకింగ్ మాత్రం కాస్త భిన్నంగా ఉంటుంది. దీంతో దర్శకుడి కథలోని వైవిధ్యం నచ్చినప్పటికీ.. అది తెలుగు మాస్ ప్రేక్షకులకు ఏ స్థాయిలో కనెక్ట్ అవుతుందనే అంశంపై మెగాస్టార్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం చిరంజీవి పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మరోవైపు తదుపరి చిత్రాల కోసం పలువురు దర్శకులతో ఆయన చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కార్తీక్ సుబ్బరాజ్ చెప్పిన కథపై చిరంజీవి తీసుకునే నిర్ణయం ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఈ కాంబినేషన్ ఖరారైతే.. టాలీవుడ్ మెగాస్టార్, కోలీవుడ్ విలక్షణ దర్శకుడి కలయికలో ఓ కొత్త తరహా సినిమా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కథపై తుది నిర్ణయం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. చిరంజీవి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేక కథలో కొన్ని మార్పులు సూచిస్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వచ్చే వరకు అభిమానులు వేచి చూడాల్సిందే.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com